ప్రభాత సమాచారం
Digital Edition
తెలంగాణ తెలుగు దినపత్రిక
PRABHATHA SAMACHARAM
16
జిల్లా అనుబంధం
మంగళవారం । 7 అక్టోబర్ 2025 ।

కుమ్రంభీం ఒక పేరు మాత్రమే కాదు..
ధిక్కారానికి ప్రతీక.. తెగువకు చిరునామా..
ఆ యోధుడి జీవితం నిత్య యుద్ధం..
భవిష్యత్ తరాలకు పాఠం..
ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకం.

- ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక కుమ్రం భీం
- అస్తిత్వ ఉద్యమాల వేగుచుక్క భీం
- నిజాం గుండెల్లో నిద్రపోయిన కుమ్రంభీం
- 1940కి ముందే తుపాకీ పట్టిన గోండు వీరుడు
- జల్-జంగల్-జమీన్ కోసం గెరిల్లా పోరాటం
- భీం స్ఫూర్తితోనే రజాకార్లతో పోరాడిన ఆనాటి యువకులు, ఆదివాసీలు
- భీం వర్ధంతికి ముస్తాబయిన జోడేఘాట్..
- 85 ఏళ్ల క్రితం గిరిజన యోధుడి అస్తమయం
- ఆయన జీవితం నేటి తరానికి ఒక పాఠం
- నేడు కుమ్రంభీం 85వ వర్ధంతి
- రాష్ట్ర పండుగగా గుర్తించిన ప్రభుత్వం

# అడవీ..! నీ బిడ్డ అమరుడు..!





"దట్టమైన అడవులు,.. ఎత్తయిన కొండలు.. అక్కడక్కడ పారే సేలయెల్లు.. ఆ సేలయెల్ల మధ్య సమాజానికి దూరంగా ఉన్న అడవి తల్లి ముద్దుబిడ్డలు.. బుక్కెడు బువ్వకోసం పడరాన్ని పాట్లు పడుతున్న రోజులవి.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధంచలేదు. దేశాన్ని తెల్లదొరలు, రాష్ట్రంలో నిజాం నవాబులు పాలిస్తున్న రోజులు.. 1935వ సంవత్సరం ఆ కాలంలో ఆసిఫాబాదే జిల్లా కేంద్రంగా ఉండేది. నీతి నిజాయితీని, అడవి తల్లిని నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసులపై నిజాం సర్కార్ పాలనలో దోపిడీ, దౌర్జన్యాలు మితిమీరిపోయాయి. అడవి బిడ్డల అక్రందనను రణనినాదంగా మార్చి కొండకోనల్లోని అడవి బిడ్డలను మేలుకోల్పిన మహాశక్తి కొదమ సింహం కుమ్రం భీం. అదివాసీ బిడ్డలపై అమానుష నిర్బంధానికి వ్యతిరేకంగా కర్షక నిజాం సర్కార్‌పై జల్-జంగల్-జమీన్ నినాదంతో జంగ్ సైరన్ ఊదిన ఆదివాసీ నిప్పుకణిక భీం ఈ లోకాన్ని విడిచి నేటికి సరిగ్గా 85 ఏళ్లు పూర్తయ్యాయి. అడవి బిడ్డల ఆత్మస్థైర్యాన్ని శిఖర స్థాయికి చేర్చి తను కనుమరుగైపోయినా తను నింపిన స్ఫూర్తిని, ధైర్యాన్ని అడవి బిడ్డలు నేటికీ తలుచుకుంటూనే ఉన్నారు."

*- సయ్యద్ కరీం, ఎడిటర్ ప్రభాత సమాచారం*



వివరాలు 15లో



# హమ్మయ్యా

- రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో ఊరట
- జీవో-9పై దాఖలైన పిటిషన్ డిస్మిస్
- హై కోర్టులోనే తేల్చుకోవాలని సూచన
- హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ
- స్థానిక పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు
- రిజర్వేషన్‌లు మారుతాయంటూ ప్రచారం
- 8వ తేదిన హైకోర్టులో విచారణ..

వివరాలు 14లో

బీసీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను తిరస్కరించింది. తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. హైకోర్టులో విచారణలో ఉండగా ఎందుకు వచ్చారని పిటిషనర్ తరపు లాయర్‌ను ప్రశ్నించింది. హైకోర్టులో పెండింగ్ ఉన్నందున విచారణకు స్వీకరించలేమని పిటిషన్‌ను కొట్టివేసింది.



## విడువని వాన
# వదలని వరద

- 12 గ్రామాలకు రాకపోకలు బంద్..
- పొంగిపొర్లుతున్న వాగులు..
- ఇబ్బందుల్లో పలు గ్రామాల ప్రజలు
- తడిసి ముద్దయిన పత్తి, మొక్క జొన్న
- పంట నష్టంతో రైతుల ఆందోళన
- వాగులో మూడు ట్రాక్టర్లు బోల్తా
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- మంచిర్యాలలో దంచి కొట్టిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం

- వివరాలు




ఉమ్మడి జిల్లా నేతలతో మాట్లాడుతున్న మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జీ మంత్రి

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి 'జూపల్లి'

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య నాయకులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో పార్టీ పరంగా బలమైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడంతో పాటు జెడ్పీలను సైతం కైవసం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి ఆత్రం సుగుణ, నిర్మల్, ఆసిపాబాద్ జిల్లాల అధ్యక్షులు శ్రీహరిరావు, విశ్వ ప్రసాద్ రావు, బైంసా మార్కెట్ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రాథోడ్ బాపూరావ్, సోయం బాపూరావ్, ఆత్రం సక్కు, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ ఇంచార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, అజ్మీరా శ్యామ్నాయక్ పాల్గొన్నారు.

## మా బడి మాకు కావాలి..


- మా పిల్లలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దు
- గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల రాస్తారోకో
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమించిన విద్యార్థులు-7



# నీటి వనరుల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- మంచిర్యాల జిల్లాలో విజయవంతంగా జల సంచాయి జన భగీదారి కార్యక్రమం
- నీటి కొరత ఉన్న ప్రాంతాలలో చెక్ డ్యాంల నిర్మాణం
- మంచిర్యాల జిల్లాను స్ఫూర్తిగా తీసుకోవాలి
- నీటి సంరక్షణపై మంచిర్యాల జిల్లా విద్యార్థులు అవగాహన అభినందనీయం
- జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ







**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ అన్నారు. సోమవారం జాతీయస్థాయి 51వ వెబినార్ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని రాజౌరి జిల్లా కలెక్టర్ అభిషేక్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లతో జల సంచాయి జన భగీదారి కార్యక్రమంలో నీటి వనరుల ఆవశ్యకత, పరిరక్షణ బాధ్యతలపై చేపట్టిన చర్యల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జల మిషన్ డైరెక్టర్ మాట్లాడుతూ జల సంచాయి జన భగీదారి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ జిల్లాలలో విజయ వంతంగా అమలు చేసిన నీటి సంరక్షణ కార్యక్రమాల ప్రదర్శన, ఇతర అంశాలతో జాతీయ జల శక్తి శాఖ ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. జల సంరక్షణలో ప్రజలందరినీ భాగస్వామ్యులను చేయడం, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను 2 కోట్ల రూపాయల అవార్డుకు అర్హులయ్యారని తెలిపారు. దేశంలో జల సంరక్షణ కొరకు ప్రధానమంత్రి జల సంచాయి జన భగీదారి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాలలో 16 గ్రామీణ, 2 పట్టణ ప్రాంతాల మండలాలు ఉన్నాయని, 82 శాతం గోండ్వానా శిలలు, 18 శాతం ఆర్కియన్ శిలలతో ఏర్పడి ఉందని తెలిపారు. జిల్లాలో సింగరేణి కాలరీస్, ఓరియంట్ సిమెంట్, ఇసుక మైనింగ్ రిత్యా ఎక్కువ నీరు అవసరం ఉందని, వర్షాధార పంటలు సాగు చేయడం జరుగుతుందని, వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా నీటి సంరక్షణ జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం జిల్లాలో 43 వేల 545 ఇంకుడు గుంతలు, 5 వేల 372 సామాజిక ఇంకుడు గుంతలు జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందని, తద్వారా భూగర్భ జల పరిమితి పెరిగిందని తెలిపారు. అటవీ పరిసర ప్రాంతాలలో బౌండరీ ట్రెంచ్ లు ఏర్పాటు చేయడం ద్వారా అటవీ జంతువుల నుంచి రక్షణే కాకుండా వర్షాకాలంలో నీటి సంరక్షణ కొరకు ఉపయోగపడుతుందని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలలో చెక్ డ్యాములు నిర్మించడం, చెట్లు నాటడం ద్వారా భూగర్భ నీటి స్థాయిని వృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఇంటికి 6 మొక్కల చొప్పున పంపిణీ చేసి నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, గత 3 సంవత్సరాలలో 45 లక్షల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. జిల్లాలో వరి, పత్తి పంట సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగిందని, భూగర్భ జల స్థాయితో పాటు నీటి నాణ్యత పెరిగిందని తెలిపారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళ గ్రూపుల ద్వారా సమావేశాలు నిర్వహించి భూగర్భ జల స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. దేశంలో మంచిర్యాల జిల్లాలో జల సంచాయి జన భగీదారి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడం జరిగిందని, మిగతా జిల్లాలలో కార్యక్రమం అమలులో మంచిర్యాల జిల్లాను స్ఫూర్తిగా తీసుకోవాలని జాతీయ జలమిషన్ డైరెక్టర్ తెలిపారు. వెబినార్‌లో భాగస్వాములైన విద్యార్థులు జల సంరక్షణపై అడిగిన ప్రశ్నలకు సమాధానం అందించి, నీటి సంరక్షణపై మంచిర్యాల జిల్లా విద్యార్థులు కలిగి వున్న అవగాహన అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, విద్యాశాఖ సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### బాసర పుష్కరఘాట్‌లో

## వ్యర్థాలతో దుర్వాసన

### శుభ్రం చేయని శానిటేషన్ సిబ్బంది

**ముథోల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** గోదావరి ఘాట్లు గబ్బు కొడుతున్నాయి. నవరాత్రులు ముగించుకొని నవదినాల ప్రతిష్ట అనంతరం బాసర గోదావరిలో మండప నిర్వాహకులు అమ్మవార్లను అత్యంత వైభవంగా అభిషేక పూజలు జరిపి విసర్జన కార్యక్రమం జరిపారు. వందలాదిగా వచ్చిన దుర్గా దేవి విగ్రహాల నిమర్జనంతో గోదావరి ఘాట్లన్నీ వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధం వ్యాపిస్తుంది. ప్రతి ఏటా ఈ తంతు జరుగుతుందని ఆలయ అధికారులకు తెలిసినా నిర్లక్ష్యం వహిస్తున్నారని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన ఆలయ శానిటేషన్ ఇంచార్జ్ విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తుండటంతో అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నూతనంగా ఈవోగా బాధ్యతలు స్వీకరించిన అంజనా దేవి ప్రస్తుతం సెలవులో ఉండటంతో ఆలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దేవి నిమజ్జనం జరిగి 24 గంటలు దాటుతున్న ఘాట్లను శుభ్రపరచడం లేదు. పుణ్యస్నానాలకు వచ్చిన చిన్నారులు వృద్ధులు అనారోగ్యాలకు గురవుతారని వాపోతున్నారు. ప్రధాన ఘాట్‌నైనా శుభ్రం చేయాలని కోరుతున్నారు.

## బీజేపీ జిల్లా కమిటీ ఏర్పాటు

**నిర్మల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ ప్రకటించినట్టు జిల్లా అధ్యక్షులు బ్రితేష్ రాథోడ్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకుల సేవలను జిల్లా కమిటీలో ఆరుగురు ఉపాధ్యక్షులు ముగ్గురు జనరల్ సెక్రెటరీలు ఆరుగురు సెక్రటరీలు ఒక ట్రెజరీ కార్యవర్గాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. సోషల్ మీడియా ఇంంచార్జీగా కడెం చెందిన రమేష్ గౌడ్‌ను నియమించడం జరిగిందని ఈ జిల్లా కమిటీ జిల్లాలో పార్టీ అభివృద్ధికి గురిచేస్తుందని తెలిపారు.

# గెలిచే అభ్యర్థులనే పోటీలో నిలుపుతాము







- అన్ని ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటాం
- సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- ఓటు చోరీ కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్యే
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**జన్నారం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని, మండలంలోని అన్ని ఎంపీటీసీ స్థానాలు, జడ్పిటిసిని కైవసం చేసుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల, ఎంపీటీసీ ఆశావాహులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా ఉంటూ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం ఎంపీటీసీలుగా పోటీ చేసే ఆశవాహులతో గ్రామాల వారిగా మాట్లాడారు. ఎంపీటీసీ పరిధిలో గల కార్యకర్తల అభిప్రాయాలు తెలు సుకున్నారు. గత ఎన్నికల్లో బిజెపి చేసిన ఓటు చోరీ గురించి కార్యకర్తలకు వివరించి సంబంధించిన కరపత్రాలను విడు దల చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫసిఉల్లా, మాజీ చైర్మన్ సతీష్ పాల్గొన్నారు.

# ఎన్నికల కంటే ముందే కరువు భత్యం మంజూరు చేయాలి




**నిర్మల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే కనీసం రెండు డీఏ లను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు దర్శనం దేవేందర్ ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని ఉద్యోగ ఉపాధ్యాయులుగా ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐదు డిఏలు ఇవ్వాల్సి ఉన్నా.. ప్రభుత్వం పట్ల సహనంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం కూడా అర్థం చేసుకొని ఉద్యోగుల పక్షపాతిగా నిలబడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న మెడికల్, జిపిఎఫ్, టిస్ జిఎల్ఐ, డిఏ ఏరియర్ బిల్లులన్నింటికి సరిపడా నిధులను మంజూరు చేసి, వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉన్న ఆర్థిక అవసరాలను తీర్చవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల మరియు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, పదవి విరమణ పొంది ఎంతో కాలం గడుస్తున్న కూడా, వారికి మానిటరీ బెనిఫిట్స్ అందడం లేదని, కావున ప్రభుత్వం వీరికి గల కుటుంబ, ఆరోగ్య రీత్యా ఉన్నటువంటి ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకొని వీటన్నింటిని వెంటనే పరిష్కరించాలని, పదవీ విరమణ పొందిన వారికి మానిటరీ బెనిఫిట్స్ తొందరగా అందే విధంగా ప్రభుత్వం కృషిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టి.ఆర్.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న, గౌరవ అధ్యక్షులు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ల చిన్నయ్య, నవీన్ కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

### ఒకే కుటుంబంలో సర్పంచ్,

## నలుగురు వార్డు సభ్యులు

**నార్నూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** రాబోయే స్థానిక సంస్థలల్లో భాగంగా జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో ఒకే కుటుంబంలోని ఒకరు సర్పంచ్.. నలుగురు వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. మండలంలోని మాలేపూర్ గ్రామపంచాయతీలో 514 ఓట్లు ఉండగా లక్కీ డ్రాలో సర్పంచుగా ఎస్టీ మహిళ రిజర్వేషన్ ఖరారు చేశారు. ఎనిమిది వార్డులకు రెండు ఎస్టీ మహిళలు, రెండు ఎస్టీ జనరల్ గా ఖరారు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఒకే గిరిజన కుటుంబం నివసిస్తుంది. కుటుంబంలో 6గురు ఓటు హక్కును కలిగి ఉన్నారు. కావున ఇప్పుడు మాలేపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, 4 వార్డులకు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం లాంఛనం అయింది.



# విడువని వాన.. వదలని వరద

- 12 గ్రామాలకు రాకపోకలు బంద్...
- ఉధృతంగా పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- భారీ వర్షంతో ఇబ్బందుల్లో పలు గ్రామాల ప్రజలు
- చేతికొచ్చిన పంట నష్టంతో రైతుల ఆందోళన
- ఆదిలాబాద్‌లో వాగులో మూడు ట్రాక్టర్లు బోల్తా
- పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం



**బెజ్జూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు సోమవారం భారీ వర్షం పడింది. మండలంలో వాగులు పొంగిపొర్లుతుండడం తో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కురిసిన భారీ



వర్షానికి బెజ్జూరు మండలంలోని కృష్ణ పెల్లి వాగు, షష్మీర్ వాగులు ఉప్పొంగి పొంగిపొర్లుతున్నాయి.. బెజ్జూర్ మండలంలోని కృష్ణ పెల్లి, సుష్మీర్, గొర్రె గూడ, సోమేని, బండలగూడెం, మూగ వెల్లి, ఇప్పలగూడ, పాత సోమిని, నాయ పెల్లి, కోయపెల్లి, తలాయి, తిక్కపల్లి తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు ప్రజాప్రతినిధులకు ఈ వాగులపై వంతెన నిర్మించాలని విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవనీ ఈ ప్రాంత వాసుల వేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిస్తే ఇబ్బందులు తప్పడం లేదని, వాగులపై వంతెన నిర్మించి ఆదుకోవాలని బెజ్జూర్ మండల వాసులు కోరుతున్నారు.



**వదలని వాన...**
**బోథ్ :** మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో నక్కల వాడ, పాత కరత్వాడ గ్రామ సమీపంలో ఉన్న వాగులు పొంగి పొర్లుతుండడంతో సోమవారం పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలు నిలిచిపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అధిక వర్షాలు పడుతుండడం వల్ల పొచ్చేర, కుంటాల జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలపాతాల వద్దకు వచ్చే సందర్శకులు తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో చేతికి వచ్చిన సోయా, పత్తి, మొక్క జొన్న రైతులు పంట చేతికి వస్తుందో లేదో అని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవా లని పలువురు కోరుతున్నారు.



**వాగులో మూడు ట్రాక్టర్లు బోల్తా...**
**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా వాగులు పొంగిపొర్లుతున్నాయి. సోమవారం రూరల్ మండలంలోని బండగూడ గ్రామ శివారులో వాగు దాటుతుండగా వరద ఉధృతి పెరిగి మూడు ట్రాక్టర్లు బోల్తా పడ్డాయి. డ్రైవర్లు, కూలీలు సురక్షితంగా బయపడ్డారు.

# కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం నిలిపివేయండి

### మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.అనిత



**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
చిన్న పిల్లల్లో దగ్గును నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వాడకాన్ని నిలిపివేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.అనిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, తెలంగాణ రాష్ట్ర వైద్య-ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వెంటనే నిలిపివేయాలన్నారు. సిరప్ సంబంధిత నిల్వలు జిల్లాలో అందుబాటులో లేవని, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మాసిస్టులు, ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిల్వలు ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన శ్రేసన్ ఫార్మా మే 2025 నెలలో తయారు చేసిన బ్యాచ్ నం.ఎస్ఆర్-13 నుంచి వచ్చిన కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వల్ల చిన్న పిల్లలలో అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఈ మందు నిషేధించడం జరిగిందన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో చాలా మంది పిల్లల మంణానికి కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగంతో సంబంధం ఉండటంతో ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ప్రకారం నమోదు చేసుకున్న అన్ని ఆసుపత్రులు, ఫార్మసీ కేంద్రాలు, చిన్నపిల్లల వైద్యులు, ప్రైవేట్ వైద్యుల వద్ద కోల్డ్ రిఫ్ సిరప్ లు ఉండరాదన్నారు. సిరప్ నిల్వలు కలిగి ఉన్న వారు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 6969 లో వివరాలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభావిత బ్యాచ్ సిరప్ నిల్వలను గుర్తించి, నిలిపివేయడానికి ఫార్మసీలు, హెూల్ సేల్ వ్యాపారులు, ఆసుపత్రులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు.. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ పరిధిలోని గ్రామాలలో ఉన్న ఫార్మసీల వద్ద ఉన్న సిరప్‌ల వివరాలు తీసుకోవాలని తెలిపారు. 2 సం.ల వయస్సు లోపు గల పిల్లలకు ఎలాంటి దగ్గు మందుల వినియోగానికి వైద్యులు సూచించరాదని, తల్లిదండ్రులు పిల్లల వైద్య నిపుణుల సూచన ద్వారా మాత్రమే మందులను వినియోగించాలని, ఫార్మాసిస్టులు, డ్రగ్గిస్ట్ లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.





### నీట మునిగిన పంటలకు

# నష్టపరిహారం ఇవ్వాలి

**లోకేశ్వరం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
వర్షాల వల్ల నీట మునిగిన పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఒక ప్రకటన విడుదల చేశారు. వరి, పత్తి, కంది, జొన్న పంటలు నీట మునిగి రైతులకు అపార నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట నీట మునగడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి ఊటకట్టి పంటలు నష్టపోయారని ఎకరాకు రూ.25 వేలు పరిహారం అందించాలని కోరారు. లోకేశ్వరం మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన

**లోకేశ్వరం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రాయపూర్(కే) గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ ఎన్నికల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారి పైన కేసు నమోదు చేస్తామన్నారు.



### భారీ వర్షాలతో పత్తి

# రైతులకు ఇబ్బందులు

**బెజ్జూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
అధిక వర్షాలతో పత్తి పంటకు పూత కథ లేకుండా పోయింది. దీంతో బెజ్జూరు మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువ మోతాదులో కొరియడం వల్ల ఏపుగా పెరిగినప్పటికీ పూత, ఖాతా లేకుండా పోయింది. ఒకవైపు అధిక వర్షాలు మరోవైపు యూరియా కొరతతో రైతులు నట్టేట మునిగిపోయారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు నిరాశే మిగిలే అవకాశం ఉంది. అధిక వర్షాల వల్ల రైతుల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. బెజ్జూర్ మండలంలో సుమారు 21,600 ఎకరాల పత్తి సాగు చేస్తున్నారు. రైతన్నలు పెట్టిన చేసిన పెట్టుబడులు సైతం వెళ్లే అవకాశం లేదని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు యూరియా దొరకక, అధిక ధరలతో పంటలు వేసి



పెట్టుబడును పెడితే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు ప్రాణహిత నది వరదల వల్ల బెజ్జూరు మండలంలోని ప్రాణహిత పరిసర ప్రాంతాలైన తలై ,పాపన్నపేట ,మగవెల్లి, నాగపల్లె, సోమినీ, భీమారం, తదితర గ్రామాలు పత్తి పంటలు ప్రాణహిత వరదల వల్ల నష్టపోతున్నారు. వ రదల వల్ల నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఆదుకోవడం లేదు. బెజ్జూరు ప్రభుత్వం స్పందించి పత్తి రైతులను ఆదుకోవాలని బెజ్జూర్ మండల రైతంగం డిమాండ్ చేస్తున్నారు.

## అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

**లోకేశ్వరం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరం మండల ఎస్సై జి.అశోక్ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే ప్రతిదీ నిజం కాకపోవచ్చని, దాన్ని షేర్ చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. ఒకరిని కించపరిచే విధంగా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేయవద్దని ఆమె సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## లోకేశ్వరం మండలంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**లోకేశ్వరం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కనకాపూర్ గ్రామంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. గునుగు,టేకు పువ్వు, తంగేడు, బంతి రకరకాల పూలను సేకరించి మహిళలు పిల్లలు, బతుకమ్మలను అందంగా పేర్చి, పూజ లు చేశారు. ముందుగా హనుమాన్ మందిరంకు వెళ్లి పూజలు చేశారు. అలాగే దుర్గా మాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా విధుల గుండా బతుకమ్మ పాటలతో ఊరేగింపు నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో గౌరమ్మను కొలిచారు. అంతా ఒక్కచోట చేరి బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. కోలాటాలు, బతుకమ్మ పాటలతో మారుమోగింది. ఆనంతరం సమీపంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.








## పత్తి విక్రయంలో రైతులు
# కపాస్ కిసాన్ యాప్ వినియోగించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేశ్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా మార్కెటింగ్ అధికారులు షహబుద్దీన్, అశ్వక్ అహ్మద్ లతో కలిసి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లల వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శులకు కపాస్ కిసాన్ యాప్ వినియోగం, రైతుల వివరాల నమోదు, పత్తి విక్రయం అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025- 26 సంవత్సరంలో కనీస మద్దతు ధర క్రింద సి.సి.ఐ. కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ 12 శాతం కంటే తక్కువగా ఉండాలని, నాణ్యతలేని / రంగు మారిన/వర్షానికి తడిసిన పత్తిని కొనుగోలు చేయడం జరగదని, రైతులు విక్రయించేందుకు విడి పత్తిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఆధార్ ప్రామాణికరణ జరిగిన తరువాతనే పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు తమ ఆధార్ కార్డులో వేలిముద్ర, కంటి స్కాన్, మొబైల్ నెంబర్ అనుసంధానం నవీకరణ చేసుకోవాలని తెలిపారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్ పట్టి ఫోటో దిగాలని తెలిపారు. బి బి బన్నీ/బ్రహ్మ పత్తి పింజ రకానికి మద్దతు ధర క్వింటాల్ కు 8 వేల 110 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని, బిబి ప్రత్యేక రకానికి 8 వేల 60 రూపాయలు, మెక్ రకానికి 8 వేల 10 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ డేటా ప్రకారం ధ్రువీకరణ చేయాలని, పత్తిలో తేమ శాతం, కనీస మద్దతు ధర, నిబంధనలు తెలిసేలా గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి పత్తి జిల్లాలోకి రాకుండా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సి.సి.ఐ. కేంద్రాలలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోకి అనుమతించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మలకు
# బహుమతులు

**మామడ, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ గ్రామంలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు బతుకమ్మలకు బహుమతులను ప్రకటించారు. వివిధ ఆకృతుల్లో సర్వాంగ సుందరంగా తయారు చేసిన బతుకమ్మలను ఎంపిక చేశారు. రెడ్డీస్ మహిళలు తయారు చేసిన బతుకమ్మకు మొదటి బహుమతిగా, రెండవ బహుమతిగా డి.నవనీత, మూడవ బహుమతిగా శ్రీరామ్ యూత్ (కుమ్మరి) వారిని విజేతలుగా ప్రకటించి సోమవారం ఆలయ ప్రాంగణంలో బహుమతులను అందజేశారు. గ్రామంలో వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని మహిళలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ ఉమేష్ రెడ్డి, క్యాషియర్ నిమ్మతోట గంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్లు రాజారెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్, నాయకులు సుధాకర్, సర్పారెడ్డి, సుదర్శన్ ఆలయ, వీడీసీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళల గాజుల పండగ

**లోకేశ్వరం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామంలో మహిళలు గాజుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. గాజులు వేసుకుంటే బాగుంటారన్న సాంప్రదాయంతో ఏకీభవించి మహిళాలు గ్రాండ్‌గా ఈ గాజుల పండుగ జరుపుకొంటున్న విషయం విధితమే. ఆదివారం మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన మహిళలు గాజుల పండగను కన్నుల పండుగ పులనిర్వహించుకొన్నారు. గల్లి మహిళలందరు స్థానిక ఆదివారం దేవి సన్నిధిలో ఏకరూప దుస్తులను ధరించి,ముందుగా గోరింటాకును ఒకరినొకరు పెట్టుకొన్నారు. అందరు పసుపు, కుంకుమ,పూలు ధరించి సాంప్రదయ బద్ధంగా ఒకరినొకరు వారి స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ గాజులు వేసుకొన్నారు. అనంతరం వంటలు చేసుకొని భోజనాలు చేశారు.తదనంతరం



కాలక్షేపనికి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని కబాడీ, కోకో తదితరులు ఆటలను ఆదారు. ఆనందోత్సహాల మధ్య గాజుల పండగను నిర్వహించుకొన్నారు.



## పోలీసు అధికారులపై
# చర్యలు తీసుకోవాలి

**ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**

**బెజ్జూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో దేవి నిమజ్జనం సందర్భంగా హిందూ మహిళలు, పురుషులపై దాడి చేసిన ఎస్పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం కాగజ్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ లో జరిగిన బందుకు భారతీయ జనతా పార్టీ తరపున పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు. జైనూర్ నుండి మొదలుకుని ఆసిఫాబాద్ వరకు అన్ని చోట్ల హిందువులపై అణిచివేత అధికమైందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉన్నదని గుర్తు చేశారు.

# కాగజ్‌నగర్‌లో దొంగలా ముఠా గుట్టు రట్టు



**కాగజ్‌నగర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

కుమ్రంభీంఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో వరుసగా గృహ దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. వరుసగా జరుగుతున్న దొంగతనాల కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తాజాగా ఈ వివరాలను కాగజ్‌నగర్ డీఎస్పీ సోమవారం వహీదుద్దీన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఓల్డ్ కాలనీకి చెందిన గాలోత్ కుషాల్ (20), ఎన్టీవోస్ కాలనీకి చెందిన ఒర్సు అనిల్ (16), ఎంపీకి చెందిన జైకుమార్ అనే ముగ్గురు కలిసి పలు గృహ దొంగత నాలకు పాల్పడ్డారు. కుషాల్ స్కావెంజర్‌గా పనిచేస్తూ జూదానికి బానిసై, ఆదాయం సరిపోక దొంగతనాలకు ఒడిగట్టినట్టు తెలిపారు. పగటిపూట తాళం వేసి ఉన్న ఇండ్లను గుర్తించి, రాత్రివేళ ప్లాన్ ప్రకారం దాడి చేసేవారని, కుషాల్, జై కుమార్ కాపలా కాస్తుండగా అనిల్ ఇంట్లోకి చొరబడి నగదు, నగలు దోచుకునేవాడని విచారణలో తేలింది ఈ ముఠా పట్టణంలో ఐదు దొంగతనాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుండి 213 గ్రాముల బంగారు నగలు, సుమారు రూ. 1.13 లక్షల విలువైన నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

# బైక్ దొంగ అరెస్ట్

**మామడ, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

గత కొద్ది రోజులుగా వివిధ గ్రామాల్లో బైక్‌లను దొంగతనం చేస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి బైకులను స్వాధీనం చేసుకున్నామని సోన్ సిఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ అశోక్‌లు అన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించారు. మండలంలోని కిషన్ రావుపేట్ గ్రామానికి చెందిన బాణావత్ వెంకట్రావు గత కొంతకాలం నుంచి జల్సాలకు అలవాటు పడి బైకులను దొంగతనం చేయడం మొదలుపెట్టాడు. పరిమండల్ గ్రామానికి చెందిన ధర్మన్న, ఆర్మూర్‌కు చెందిన మరో వ్యక్తి బైక్‌లను దొంగిలించాడు. అనుమానం రావడంతో బైక్‌పై వెళ్తున్న వెంకట్రావును పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ అశోక్‌లు పేర్కొన్నారు.



# అవసరం మేరకు యూరియా తీసుకోవాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, రైతులు అవసరం మేరకు తీసుకొని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి సురేశ్, డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులతో యూరియా పంపిణీ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియాను సక్రమంగా వినియోగించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, అవసరం మేరకు తీసుకునేలా వివరించాలని తెలిపారు. జిల్లాలో పంట సాగు సక్రమంగా జరిగేలా రైతులకు సహకరించాలని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హత గల ప్రతి రైతుకు పంట సాగుకు అవసరమైన యూరియా అందించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా దేవి, బతుకమ్మ నిమజ్జనం

**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో శ్రీ శారదా దేవి, బతుకమ్మల నిమజ్జనోత్సవం ఘనంగా కొనసాగాయి. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహాలకు, బతుకమ్మల దసరా పండుగ తర్వాత నిమజ్జనాలు చేపట్టడం జిల్లాలో అనవాయితీ వస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వాడ వాడలా గత 3 రోజులుగా నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. అదేవిధంగా బతుకమ్మ నిమజ్జనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహిళలు, యువతులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను బతుకమ్మ గద్దెల వద్దకు తీసుకువచ్చి, బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కోలాటాలు, డీజేసౌండ్‌లకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు.

### అటవీ అధికారులపై దాడికి
## పాల్పడ్డ వ్యక్తిపై పీడీ యాక్టు



**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

అటవీ అధికారులు, పోలీసులపై దాడులు చేస్తున్న నిందితులపై కేసు నమోదు చేయడంతో పాటు కేశవపట్నం గ్రామానికి చెందిన అల్తాఫ్‌పై పీడీ యాక్టు కేసు పెట్టి నమోదు చేసినందుకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు జిల్లా అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసిషన్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు అధికారులకు అండగా నిలిచి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### జోనల్ స్థాయి పోటీలకు
## జిల్లా క్రీడాకారుల ఎంపిక



**నిర్మల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

అండర్-14 బాక్సింగ్ జోనల్ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని ఎస్జిఎఫ్ కార్యదర్శి రవీందర్ గౌడ్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి నిజామాబాద్‌లో జరిగే పోటీలకు పంపనున్నారు.

### ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ
## అవార్డు కోసం దరఖాస్తుల స్వీకరణ

**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 14వ తేదీలోగా అందజేయాలని తెలిపారు.

# సోయాకు మద్దతు ధర లభించేనా?

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ఊసెత్తని సర్కార్
- గణనీయంగా తగ్గనున్న సోయా దిగుబడులు
- మద్దతు ధర దక్కితేనే అన్నదాతకు మేలు



**ముథోల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

వాన కాలంలో సాగుచేసిన సోయా పంటకు మద్దతు ధరపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈసారి సోయా పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. వాన కాలంలో సాగుచేసిన సోయా పంట ప్రస్తుతం కోతకు వస్తున్న ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ఇంకా స్పష్టత లేకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. నిర్మల్ జిల్లాలో ఈ వానాకాలం సీజన్లో 1,20 లక్షల ఎకరాల్లో సోయా పంట సాగుచేసినట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం స్వయపంటకు మద్దతులను క్వింటాలుకు 53 80 రూపాయల మద్దతు ధరను ప్రకటించింది. మద్దతు ధర తగ్గాలంటే ప్రభుత్వం వెంటనే జిల్లా వ్యాప్తంగా మార్పిడి ఆదరణ సోయా పంట కొనుగోలను ఏర్పాటు చేయవలసి ఉంది. ఇప్పటికీ మార్క్ఫెడ్ కొనుగోళ్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ప్రభు త్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో ప్రభుత్వ కొనుగోలు ఉంటాయా ఉంటాయా అని అనుమా నం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. ఈ సంవత్సరం వర్షాకాల ప్రారంభం నుంచి అధిక వర్షాలు కురవడం వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో సోయా పంట అనుకున్న స్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశాలు లేదని రైతులు తెలిపారు. గతంలో సోయా పంట దిగుబడులు ఎకరానికి 6 నుంచి 8 గంటల వరకు దిగుబడి వచ్చేవన్నీ ఇప్పుడు అది మూడు నుంచి నాలుగు కుంటలు మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు తెలిపారు. జిల్లాలోని సారంగాపూర్, దిలావర్‌పూర్, కుంటాల, కుభీర్, తానూర్, మామడ ముధోల్, బాసర, లోకేశ్వరం తదితర మండలాల్లో రైతులు సాగు చేసిన సోయా పంట కోతకు రావడంతో కోతలు కోసి పంటలు ఆరబెట్టెందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

**ప్రభుత్వ మద్దతు ధర దక్కితేనే లాభం...**

నిర్మల్ జిల్లాలో సోయా పంట సాగుచేసిన రైతులకు ఈ సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు లక్కితేనే లాభం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సోయాకు 53 80 రూపాయల మద్దతు ధరను ప్రకటించిన విషయం అందరికీ తెలిసింది. జిల్లాలో మార్కెట్ ద్వారా ఐదు మార్కెట్ కమిటీ పరిధిలోని ఎనిమిది పంట కొనుగోలు కేంద్రా లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన కొనుగోల నిర్వహణపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అనుమానంగా ఉందని అంటున్నారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో రైతులు సాగు పంటలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రైవేట్ దళారుల వద్ద పంటను విక్రయించవలసి వస్తుంద ని అంటున్నారు. ప్రస్తుతం దళారులు 4,500 వరకు కొనుగోలు చేస్తున్నారని వర్షాల కారణంగా ధాన్యం గింజలు నిలబడడం పంట నాణ్యతగా లేదన్న సాగుతూ వారు ధరను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం గానీ ప్రైవేటు దళారుల వద్ద మద్దతు ధరలు దక్కిన చర్యలు తీసుకోవడంగానీ చేపడితేనే రైతులకు ప్రయోజనంగా ఉంటుందని జిల్లా రైతులు కోరుతు న్నారు. పంట కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రినాగేశ్వరరావుకు ఇప్పటికే జిల్లాకు చెం దిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జులు మొరపెట్టుకున్నప్పటికీ ఆ దిశగా చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టకపోవడంపై జిల్లాలో సోయా రైతులు ఆందోళన చెందుతున్నారు.

# రాష్ట్ర పండుగగా కొమురం భీం వర్ధంతి

**సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదివాసీ నాయకులు**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీల ఆరాధ్యుడు, నిజాం నిరంకుశ పాలనపై విరోచిత పోరాటం చేసి అసువులు బాసిన కుమ్రం భీం వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పండుగగా గుర్తించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక చొరవ తీసుకుంటుందని ఆయన తెలిపారు. మంగళవారం కెరమేరి మండలంలోని జోడేఘాట్ లో జరిగే భీం వర్ధంతికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హాజరు కానున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

# పంచాయతీలో అడుగడుగున సమస్యలు

**పడకేసిన పారిశుద్ధ్యం**
**పట్టించుకోని పంచాయతీ అధికారులు**



**భీమిని, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పంచాయతీల్లో అడుగడుగున సమస్యలతో గ్రామ స్తులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని కురుమ వాడ నుంచి ఎస్టీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి మూలమలుపు వద్ద మంచి నీటి వాటర్ ట్యాంకు అనుకొని చెత్తకుప్పలు నెలలుగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు ఉన్నప్పటికీ వారితో పని చేయించేవారు లేరు. పంచాయితీ కార్యదర్శి ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లల్లోకి వెళ్లాలంటే దారి వెంట దుర్వాసన వస్తున్నట్లు నివాస ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట దోమ ల బెడద ఎక్కువగా ఉన్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ జరగడం లేదని కాలనీవాసులు అంటున్నారు. చెత్త వేసే చోట కొందరు కాలనీ వాసు లు బహిర్భూమికి సైతం వెళ్లడంతో దుర్వాసన వెదజల్లి ముక్కు మూసుకునే పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికైనా అధికారులు రహదారి పక్కన ఉన్న చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## అక్రమ కేసులు ఎత్తివేయాలి

**ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

పోలీసులు వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఈ నెల 3న జిల్లా కేంద్రంలో దుర్గా, శారదామాత నిమజ్జనం సందర్భంగా సాంప్రదాయబద్ధంగా శాంతియుతంగా ఊరేగింపు నిర్వహిస్తున్న బ్రాహ్మణవాడ మహిళలపై ఎస్సై అనుచిత వాఖ్యలు చేయడంతో పాటు పలువురు నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని కేశ వనాథ మిని పంక్షన్ హాల్లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాదరావుతో పాటు శారదా, దుర్గా మాత మండళ్ల నిర్వహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ ఉత్సవాల పై పోలీసుల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ఉత్సవ సమితి చెప్పినట్లు నడుచుకోవాలన్నారు. పోలీసులు మాట్లాడే విధానం సరికాదన్నారు. డిజెలతో ఉపాది పొందుతున్న యువతకు చెందిన డిజెలను పోలీస్ స్టేషన్‌కు సరికాదన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాదరావు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన సీఐ చిన్న చిన్న విషయాలపై ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. శుక్రవారం రాత్రి ఎఎస్పీ చిత్తరంజన్ ఏఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పి, తల్లవారున నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్ యాదవ్ మాట్లాడుతూ పోలీసులు హిందూ దేవీ దేవతలను అవమాన పరచడం సరికాదన్నారు. కార్యక్రమానికి హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు సంతోశ్, మాజీ ఎఎంసీ చైర్మన్లు వెంకన్న, మల్లేశ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

# శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం




**కాగజ్‌నగర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళ రాష్ట్ర ఐదవ సదస్సులు ప్రారంభం సందర్భంగా బాల భారతి స్కూల్ నుంచి వినయ్ గార్డెన్ వరకు గుస్సాడి, ఒగ్గుడోలు, డోలు, ఆదివాసి, ఇతర కళారూపాలతో మార్కెట్ వీధులలో అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్ చౌరస్తా, లారీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా భారీ ర్యాలీ వినయ్ గార్డెన్ వరకు నిర్వహించారు. అనం తరం జరిగిన బహిరంగ సభకు సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్ త్రివేణి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు పాల్గొని మాట్లాడారు. సమాజంలో సగభాగంగా ఉన్నటు వంటి మహిళలు నేటి పాలకుల విధానాల ఫలితంగా ఆర్థిక రాజకీయ అన్ని రంగాలలో వివక్షతకు గురవుతున్నారని, కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం విధానా లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గుస్సాడి, ఒగ్గుడోలు, డోలు కళారులను ఇప్పటికైనా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్వి రమ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జే వెంకటేష్, పి జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు జే. రాజేందర్, ముంజం శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు కూశన రాజన్న, దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, ఆనంద్ కుమార్, గోడిసెల కార్తీక్, గేడం టికానంద్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, జిల్లా కార్యదర్శి ఆర్ మహేష్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, బక్కన్న, వివిధ జిల్లాల నాయ కులు, శ్రామిక మహిళలు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని వినతి

**నిర్మల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలోని సోఫీనగర్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీకి చెందిన యువ నాయకుడు రాహుల్ గౌడ్ సోమవారం మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు హాని కలిగించే పరిశ్రమలను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## 'భోజన' కార్మికుల ఆందోళన

**దండేపల్లి, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** దండేపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు తమకు రావాల్సిన ఆరు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సోమవారం ఎంఈఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఆరు నెలలుగా వేతనాలు, భోజనపు బిల్లులు రాకపోవడంతో కిరాణా దుకాణాల్లో బాకీ పెరిగిపోయి సరుకులు ఇవ్వడం లేదని, తమ బకాయిలు వెంటనే చెల్లించాలని వారు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి పౌరునికి నివాసం కల్పించాలి



**మందమర్రి, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** సొంతింటి సౌకర్యం ప్రతి పౌరుని మౌలిక హక్కు అని ప్రభుత్వాలు పౌరులకు సొంతింటి సౌకర్యం కల్పించాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ప్రపంచ నివాస దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు పౌరుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలనీ, అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు కాదని, ప్రతి కుటుంబానికి మచ్చిక ఇంటిని ఇవ్వడమే నిజమైన అభివృద్ధని అన్నారు. సొంతింటి సాకారం కావాలంటే హౌసింగ్ స్కీమ్స్, రుణ సబ్సిడీలు, తక్కువ ధరల ప్లాట్లు, పేదల కోసం ఉచిత గృహ నిర్మాణాలు వంటి చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. పౌరుల మచ్చిక ఇల్లు అవసరాన్ని తీర్చే బాధ్యత ప్రభుత్వాలదే అని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సొంత గృహం ఉండేలా చేయడం ప్రభుత్వాల కర్తవ్యమే కాదు, అది నైతిక బాధ్యత అని అన్నారు. పౌరుల కలలను నెరవేర్చే మార్గంలో ప్రభుత్వం తొలి అడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ నాయకులు గోమాస శ్రీనివాస్, లింగంపల్లి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# సీజేఐపై న్యాయవాది దాడి గర్హనీయం



**బెల్లంపల్లి, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి రాజ్యాంగంపై చేసినట్లేనని పూలే పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక అధ్యక్షులు గోడిసెల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్ మండిపడ్డారు. సోమవారం బెల్లంపల్లిలో న్యాయమూర్తి దాడిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్దిస్ట్ దళిత కమ్యూనిటీ నుంచి వచ్చిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి బిఆర్ గావాయ్ పై లాయర్ రాకేష్ కిషోర్ దాడిని రాజ్యాంగంపై మనువాద దాడిగా అభివర్ణించారు. రాజ్యాంగ బద్ధకంగా మాట్లాడటం, తీర్పులు ఇవ్వడాన్ని సహించలేక సహనం కోల్పోయినా మనువాది లాయర్ దాడికి దిగారన్నారు. అంతేకాకుండా సనాతన ధర్మాన్ని కించపరుస్తే ఊరుకునేది లేదని న్యాయమూర్తినే హెచ్చరించడం, క్షమించరాని నేరమని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేసిన వారిని కఠింగా శిక్షంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అక్కు ఉమ, ప్రచార కార్యదర్శి గొడిసెల చంద్ర మౌళి, అక్కు కృష్ణ, కార్యదర్శి అక్కుకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గొడిసెల స్వామి, సంయుక్త కార్యదర్శి ఉండ్రాల రవి, ముఖ్య సలహాదారులు వేల్పుల కనకయ్య, జెంజర్ల రవిరాజ్, ఎంజల కుమార్, డాక్టర్ జంగం, తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ కోసం కష్ట పడి పని చేసిన
# కార్యకర్తలకు గుర్తింపు

**ముధోల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సోమవారం భైంసా పట్టణంలో మాట్లాడుతూ, నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించి, అందరి అభిప్రాయం మేరకే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఖరారు చేస్తామని తెలిపారు. కుభీర్, కుంటాల, భైంసా, నర్సాపూర్ (జి) మండలాల బీజేపీ నాయకులతో జరిగిన సమావేశంలో, ముధోల్ నియోజకవర్గ నాయకులు కలిసికట్టుగా పనిచేసి అన్ని చోట్ల బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన సూచించారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ తప్పకుండా గుర్తింపు ఇస్తుందని, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచ్ స్థానాలు బీజేపీ కైవసం చేసుకునేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఉచిత కంటి వైద్య
# శిబిరానికి విశేష స్పందన



**జన్నారం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా సోమవారం జన్నారం మండల కేంద్రంలో శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషలిటీ కంటి దవాఖానా వారి సౌజన్యముతో ఉచిత కంటి శిబిరం, మెడి కవర్ హాస్పిటల్ కరీంనగర్ వారి సౌజన్యముతో వయోవృద్ధులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైండ్ల మొండయ్య జాతీయ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ సిటిజెన్ కాన్ఫడరేషన్ మంచిర్యాల హాజరై జ్యోతి ప్రజ్వలన గావించినారు. మొండయ్య మాట్లాడుతూ తాను రాష్ట్ర, జాతీయ స్థాయిలో సీనియర్ సిటజెన్స్ సమస్యలపై గలమెత్తి హక్కుల సాధనకొరకు రాజీలేని పోరాం చేస్తున్నామన్నారు. వృద్ధాప్యంలో తల్లితండ్రులను వారి పిల్లలు పోషించాల్సిన భాద్యత తీసుకోవాలని ఆకాంక్షించినారు. కార్యక్రమంలో సీనియర్ సిటజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గోపి సత్యనారాయణ, కార్యదర్శి దుర్గం రాజలింగం ఉపాధ్యక్షులు పిట్టా రాజారావు, రామకృష్ణ కోశాధికారి పుల్లయ్య కార్యవర్గ సభ్యులు తిరుపతి రెడ్డి, రాజలింగు సహాయ కారదర్శి గాబ్రాయల్ పెన్షనర్స్ అసోసియేషన్ జన్నారం మండల అధ్యక్షులు అడ్డగూరి భూమన్న పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

## బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్



**ఇంద్రవెల్లి, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి అని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. విజయం కోసం పక్కా ప్రణాళికతో ప్రజల ముందుకు వెళ్లాలని సూచించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల ముందుకు వెళ్లి ఓటు అడిగే పరిస్థితి లేదని, మనమంతా ధైర్యంగా ముందుకెళ్లి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు మారుతిపటేల్ డోంగ్రే. మాజీ ఎంపీపీ పోటే శోభాబాయి. నాయకులు అంజద్. జిలానీ బేగ్. సుఫియాన్. విజయ్ కుమార్. గణేష్ టేహెరే. పుర్క బాపురావ్. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మా బడి మాకు కావాలి

### మా పిల్లలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దు
### గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల రాస్తారోకో
### కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

**సిర్పూర్ (టి), అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని గురుకులం ఎదుట కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాస్తారోకో చేపట్టారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గత ఆగస్టు నెలలో రాష్ట్ర సాంఘిక సంక్షేమాధికారి, కలెక్టర్ 540 మంది విద్యార్థు లను ఉమ్మడి జిల్లాలోని వివిధ గురుకులాల్లో సర్దుబాటు చేశారు. రెండు నెలలుగా చదువు కుంటున్న విద్యార్థులు అక్కడి విద్యాభ్యాసం, భోజన వసతి, ఇతర వసతులు సరిగ్గా లేవని విద్యార్థులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సోమవా రం సిర్పూర్ (టి) మండల కేం ద్రంలోని గురుకులం ఎదుట కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాస్తా రోకో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యా



ర్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇక్కడే తాత్కాలికంగా వసతులు కల్పించి తమ పిల్లలను చదువులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాలకు తమ పిల్లలను పంపించడంతో విద్యాభ్యాసం నాశనమవుతుం దని ఉన్నతాధికారులు వచ్చే వరకు తాము ఆందోళన విరమించబోమని పట్టుబడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రహీము ద్దీన్ చేరుకుని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలకు సమాచారం అందించారు. అయినా అధికారులు రావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు బలవంతంగా విద్యార్థుల తల్లిదం డ్రులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. తిరిగి విద్యార్థులు రోడ్డుపై పడుకోవడంతో తహసీల్దార్ విద్యార్థులకు నచ్చచెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్, సబ్ కలెక్టర్ కాగజ్‌నగర్ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల భవనంతో పాటు కౌటాల మండ లం విజయనగరంలోని సాంఘిక పాఠశాలలో విద్యార్థులను తిరిగి సర్దుబాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతు తెలిపి ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అక్కడినుంచి పంపించి వేశారు. ఎస్సైలు సురేష్, సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.




### వన్యప్రాణుల సంరక్షణ
## మన అందరి బాధ్యత

**జన్నారం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత కావాలని జన్నారం ఎఫ్డిఓ రామ్మోహన్ అన్నారు. సోమవారం వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా జన్నారం మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో, ఇందన్‌పెల్లి రేంజ్ కార్యాలయం, తాళ్లపేట రేంజ్ కార్యాలయాల్లో అటవీ శాఖ అధికారులచే ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ జంతువులపై ప్రేమ కరుణాదయ కలిగి ఉండాలన్నారు. అడవుల పెంపుదలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అడవులు సమృద్ధిగా ఉంటేనే అందులో అటవీ జంతువులు సమృద్ధిగా నివసిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు శ్రీధర్ చారి, సుష్మారావు, జన్నారం ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ మమత, ఎఫ్ఎస్ఓలు ఎఫ్‌బీవోలు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

### అక్టోబర్ 15,16 తేదీల్లో
## దండారీ ఉత్సవాలు



**కాసిపేట, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని సల్పాలవాగు సమీపంలోని వెంకటాద్రి దేవాలయం వద్ద అక్టోబర్ 15,16వ తేదీల్లో రెండు రోజుల పాటు దండారీ ఉత్సవాలను నిర్వహించేందుకు తీర్మానం చేశారు. సోమవారం కాసిపేట మండలంలోని సల్పాలవాగు వద్ద నిర్వహించిన సమావేశంలో దండారీ నిర్వాహకులు, గ్రామ పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో చర్చించి ఈ మేరకు తీర్మానం చేశారు. 15వ తేదీ దండారీ నిర్వాహణ, పూజలు, 16న దండారీ దర్బార్ నిర్వహించేందుకు నిర్ణయించారు.

## ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ



**దండేపల్లి, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి లక్ష్మణ్ అన్నారు. సోమవారం దండేపల్లి మండలంలోని జైతుగూడ, కుంటల్ పహాడ్ గిరిజన ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులు, రిజిస్ట్రార్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఎస్సీఆర్పీ రఘునాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



### కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మైనారిటీ విద్యాసం స్థలలో విద్య అభ్యసించి వైద్య విద్య (ఎం.బి.బి.సి.)లో సీట్లు సాధించడం అభినందనీయమని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వైద్య విద్యలో సీట్లు సాధించిన విద్యార్థులను శాలువా, మొక్కలతో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు కాగజ్ నగర్ లోని బాలుర మైనారిటీ విద్యాసంస్థలలో చదివి వైద్య విద్యలో సీటు సాధించిన సయ్యద్ అంజద్ అలీ, సయ్యద్ ఇక్రాముద్దీన్, సయ్యద్ అబుజార్‌లను అభినందించారు. సీట్లు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి వైద్యులుగా ఆసిఫాబాద్ జిల్లాలో సేవలందించాలని కోరారు. వీరి ప్రతిభ విద్యార్థులకు ఆదర్శనీయమని, తల్లిదండ్రులు మైనారిటీ గురుకులాలలో తమ పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ నదీమ్, మైనారిటీ అకాడమిక్ సమన్వయకర్త రిజ్వాన్, విజిలెన్స్ అధికారి తాహెర్, కళాశాల పూర్వ ప్రిన్సిపల్ జబ్బర్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నాం



### వందుర్‌గూడ్ గిరిజనుల తీర్మానం

**దండేపల్లి, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల నోటి ఫికేషన్ నేపథ్యంలో వందుర్‌గూడ, వెంకటాపూర్ పంచాయతీలకు వేరు వేరుగా నోటఫికేషన్ వెలువరించటాన్ని వ్యతిరేకిస్తూ వందూర్‌గూడ గిరిజనులు ఆదివారం రాత్రి సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తీర్మానం చేశారు. వందూర్‌గూడ గ్రామ పటేల్ దౌలత్‌రావు మొ కాసి మాట్లాడుతూ గతంలో దండేపల్లి మండలం వెంకటాపూర్ పంచా యతీలో వందుర్‌గూడ కొనసాగింది. 2018లో అధికారుల తప్పుడు నివేదికతో వందూర్‌గూడను వెంకటాపూర్ జీపీ నుంచి వేరు చేసి కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. వందూర్‌గూడను వెంకటాపూర్ జీపీలో కొనసాగించాలని ఇటీవల కోర్టులో ఫిటిషన్ వేశామన్నారు. అధికారులు మ ళ్లీ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం అధికారులకు ఆదేశాలు జారీ చేసి నెల రోజు కావాస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ రెండు జీపీలకు వేరు వేరుగా వెలువరించడం పట్ల వందుర్‌గూడ్ గిరిజనలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తామంతా స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నామని తీర్మానించారు. కార్యక్రమంలో వందుర్‌గూడ గిరిజనులు కోవ ధర్మరావు, మారుతీ, ఆడ చందు, కుంరం బాపురావు, పెంద్రం హేమంత్, సేడ్మకి తిరుపతి, గిరిజనులు పాల్గొన్నారు.



## రైతుకు అండగా ఉంటాం

### ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
రైతులకు అండగా ఉంటామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షంకు ముథోల్‌లో తడిసిన సోయపంటను సోమవారం పరిశీలించారు. సోయా దిగుబడులు కోసి కల్లంలో అరబెట్టగా, భారీ వర్షానికి తడిసిపోయి నష్టం జరగడం దురదృష్టకరమన్నారు. రైతులు దిగులు చెందకూడదని రైతుల వెన్నంటి ఉంటానని చెప్పారు. నష్టపోయిన పంట వివరాలను వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేలా భరోసా ఇచ్చారు.సోయా పంట విషయమై అసెంబ్లీలో లేవనెత్తుతా అని అన్నారు. ప్రభుత్వం స్పందించి త్వరలోనే సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే వెంట మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న, మాజీ సర్పంచ్,ఎంపిటిసి గంట శ్రీనివాస్, దేవోజీ భూమేష్, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, పోతన్న, జీవన్, మోహన్ యాదవ్, బత్తినోళ్ల సాయి,బాలు, పాటు రైతులు తదితరులున్నారు.

## కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ

**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని 73 ఏ4 మద్యం దుకాణానికి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా కేంద్రంలోనీ కాలేజ్ రోడ్‌లో గల సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ లో 2025-27 సంవత్సరాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్లలో సోమవారం పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. మొదటిరోజు రెండు దరఖాస్తు రాగా సోమవారం మరో ఆరు దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని మంచిర్యాల, లక్షెట్టిపేట, చెన్నూరు, బెల్లంపల్లి ఎస్సై పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఇప్పటి వరకు 8 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్, ఎక్సైజ్ సిఐలు గురువయ్య, ఇంద్రప్రసాద్, హరి, సమ్మయ్య, తిరుపతి పాల్గొన్నారు.



# పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బతుకమ్మ సందడి

- కుటుంబ సమేతంగా హాజరైన జిల్లా ఎస్పీ
- మహిళా పోలీసులతో కలిసి ఉత్సాహంగా ఆడి పాడిన ఎస్పీ అఖిల్ మహాజన్ దంపతులు..







**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలను జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం వివిధ పోలీస్ స్టేషన్ ల నుండి మహిళ పోలీసులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, పోలీసు అధికారులు, మహిళా సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ముందుగా బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అందరితో కలిసి ఎస్పీ బతుకమ్మ సంబరాలలో బాగంగా ఉత్సాహంగా నృత్యాలు చేసారు. చివరగా అత్యంత సుందరంగా అలంకరించిన బతుకమ్మలకు బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందటం గొప్ప విషయమని తెలిపారు. పోలీసుల కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడడం ఇంతమంది కుటుంబ సభ్యులను కలిసినందుకు ఆనందంగా ఉందని అన్నారు. బతుకమ్మలను పేర్చి ఆడుతూ, ఐక్యత, ప్రేమను కలిపి రంగరిస్తూ మానవహారం ఏర్పరిచి పాటలు పాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీలు, సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెజారిటీ స్థానాల గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలి

- బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరిగింది
- పార్టీ శ్రేణుల సమీక్షలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ దిశా నిర్దేశం



**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ మెజార్టీ స్థానాల్లో గెలుపొందేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై ఎంపీ, ఎమ్మెల్యేలు చర్చించి, దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ బీజేపీ తరపున పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు ఉత్సాహాన్ని చూపుతున్నారని అన్నారు. దీనికి గల కారణాలు గత 10 ఏళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రన్ని భ్రష్టు పట్టించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తోందని అందుకే బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఇప్పటికే బీజేపీ బలంగా ఎదిగిందని, ఉమ్మడి జిల్లాలో 4జడ్పీ చైర్మన్ స్థానాల కైవసం కోసం బీజేపీ పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఇతర పార్టీలోనీ కార్యకర్తల మాదిరిగా కాకుండా ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలు బీజేపీలో ఉన్నారని, మెజార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను బీజేపీ కైవసం కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రాణాపాయంలో నవజాత శిశువు

## తక్షణమే స్పందించిన 'నియోనాటల్' సిబ్బంది

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఉదయం డెడ్రా గ్రామానికి చెందిన నాగుల్వాడ్ నిఖిత ఆడ బిడ్డను ప్రసవించింది. అయితే బేబీ తక్కువ బరువు పుట్టడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్య సిబ్బంది ఆదిలాబాద్‌లోని నియోనాటల్ వాహనానికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన వాహనం సిబ్బంది మేమున్నామంటూ సీనియర్ ఈఎంటీ ప్రదీప్ నివాస్ వైద్య పరీక్షలు చేసి తక్కువ బరువుతో బేబీ పుట్టడంతో హార్ట్ బీట్ ఎక్కువ ఉండటంతో పైలెట్ శివ కుమార్ వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. నియోనాటల్ వాహన సిబ్బంది మాట్లాడుతూ.. తక్కువ బరువుతో పుట్టిన శిశువులకు, ఊపిరితిత్తులు, హృదయం పూర్తిగా అభివృద్ధి చెందకుండా పుట్టిన వారికి, పుట్టిన వెంటనే శ్వాస సమస్యలు ఉన్నవారికి రక్తంలో ఇన్ఫెక్షన్ వచ్చిన వారికి వెంటనే వార్డ్‌కి తరలించాలి. ఇందుకు గాను పసికందుల మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో నవజాత శిశువులకు సంబంధించిన పూర్తి వైద్య పరికరాలు ఉన్న నియోనాటల్ వాహనం అడ్వాన్సుడ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది అని అత్యవసర సమయాల్లో ఇటువంటి సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు.

# నేడు విద్యాసంస్థలకు సెలవు

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** గిరిజన పోరాటయోధుడు కుమ్రంభీం వర్ధంతి పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు మంగళవారం లోకల్ పబ్లిక్ హాలీడేగా ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు బదులుగా డిసెంబర్ 13న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు పనిచేస్తాయన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల కృషి

**ఖానాపూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టిన కడెం ఎస్ఐ సాయికిరణ్, పోలీస్ సిబ్బందిలను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. నిర్మల్ జిల్లా కడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మాజీపేట గ్రామ సమీపంలో ఎపుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటున్నాయి. ఈ సంఘటనలు దృష్టిలో ఉంచుకుని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కడెం ఎస్ఐ సాయికిరణ్ సోమవారం ధర్మాజిపేట్ గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాల అవగాహన కల్పించరు. గ్రామ ప్రజల సహకారంతో ధర్మాజిపేట్ గ్రామ సమీపంలో రహదారి మూలమాలుపున ఎపుగా చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామస్తుల సహకారంతో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించిన్నట్లు అయన తెలిపారు.



# మంచిర్యాలలో దంచికొట్టిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కౌటాల మండలంలో పిడుగుపాటుకు 2ఎడ్లు మృతి



**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పలు మండలాల్లో సోమవారం వాన దంచికొట్టింది. కాసిపేట, నెన్నెల, వాంకిడి, తదితర మండలాల్లో వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వారం రోజులుగా కురుస్తున్న వానలతో పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయ ని రైతులు వాపోయారు. బెల్లంపల్లి పట్టణం లో బజార్ ఏరియా, పాతబస్టాండ్, కాంటా చౌరస్తా, 13వ వార్డు కాల్‌టెక్స్ ఏరియా, సెయింట్ మేరీస్ పాఠశాల, తదితర లోతట్టు ప్రాంతాలు రోడ్లపై నీరు పారింది. శాంతిఖని గని ఆవరణలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. భీమినిలో జడ్పీ పాఠశాల విద్యార్థులు వర్షంలో తిప్పలు పడ్డారు. సైతం ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని బడికి వెళ్లారు.

**పిడుగు పాటుకు రెండు ఎడ్లు..**

కౌటాల మండలంలోని ముత్తంపేటలో వర్షానికి పిడుగు పడి రెండు ఎడ్లు పంట చేనులో అక్కడికక్కడే మృతి చెందా యి. తనకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని బాధిత రైతు బెండారే శ్యాంరావు కోరాడు. బాధితుడిని బీఆర్ఎస్ నాయకులు వసంత్ రావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు పరామర్శించారు. వర్షంతో కౌటాల మండల కేంద్రంలో వారసంతలోని వ్యాపారులు, కొనేందుకు వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు.

**ఉప్పొంగిన రాళ్లవాగు...**

రెండు రోజులుగా మంచిర్యాలకు ఎగువన ఉన్న మందమర్రి, కాసిపేట, తిర్యాణి, నెన్నెల మండలాల్లో కురిసిన వర్షానికి సోమవారం సాయంత్రం రాళ్లవాగు ఉప్పొంగింది. మంచిర్యాలలోని లక్ష్మీటాకీస్ బైపాస్ రోడ్డు అమరవీరుల స్తూపం నుంచి రంగంపేటకు రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వే వంతెన పైనుంచి వరదనీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

## చీరకట్టులో కృతి శెట్టి సోయగం



కన్నడ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న కృతి శెట్టి తొలిసారి.. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమాలో బేబమ్మ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది కృతి శెట్టి. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా, కృతి శెట్టి హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అతి తక్కువ సమయంలోనే 100కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఇద్దరికీ ఇది తొలి చిత్రమైనా.. తమ నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత నానితో శ్యామ్ సింగరాయ్, నాగచైతన్యతో బంగార్రాజు వంటి చిత్రాలు చేసి హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన మొదట్లోనే హ్యాట్రిక్ అందుకున్న హీరోయిన్గా కూడా రికార్డు సృష్టించింది కృతి శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయింది. అందులో భాగంగానే వరుస పరాజయాలు తలుపు తట్టడంతో కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమైంది ఇప్పుడిప్పుడే మళ్లీ తనను తాను కం బ్యాక్ చేసుకోవాలని చూస్తున్న కృతి శెట్టి.. ఇటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తోంది. మొదట్లో పద్ధతిగా కనిపించి, ఆ తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈమె తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి ఏకంగా చీరకట్టుతోనే చూసే ఆడియన్స్ కు చెమటలు పట్టించేసింది కృతి శెట్టి. తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఇన్ని రోజులు ఇంత అందాన్ని ఎలా మిస్ అయ్యాం అంటూ కామెంట్లు చేస్తున్నారు. శారీ విషయానికి వస్తే.. ఎంబ్రాయిడరీ నెట్టెడ్ లైట్ ఆరెంజ్ కలర్ తో డిజైన్ చేసిన చీరను కట్టుకొని , అందుకు కాంబినేషన్లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ లో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా జుట్టును వదులుగా వదిలేసి సింపుల్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. ఇందులో నడుము, ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు, అటు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ కి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. పైగా ఈ ఫోటోలకు దేశీ గర్ల్ వైబ్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ముఖ్యంగా ఈమె అందాలను చూసి ఏఐ జనరేటర్ లాగా ఉంది అని కామెంట్లు చేస్తుంటే.. మరికొంతమంది లవ్, ఫైర్, స్మైల్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఇంకొంతమంది నువ్వే నా జాన్ అని కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఎవరికి వారు తమ ప్రేమను ఒలకబోస్తూ కృతి శెట్టి ఫోటోలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృతి శెట్టి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తమిళంలో ఒక సినిమాలో నటిస్తోంది.

## ఫ్యాన్స్ కోసం



విజయ్ దేవరకొండ రష్మికా మందన్నా ప్రేమలో పడటం కన్ఫమ్ అయింది. ఇంతకాలం ఇద్దరి మధ్య రిలేషన్ షిప్ కేవలం స్నేహం వరకే అనుకున్నా? అంతకు మించి ప్రేమ పరుగులు పెడుతుందని క్లారిటీ వచ్చేసింది. మరీ రిలేషన్ షిప్ ని పెళ్లి వరకూ తీసుకెళ్తారా? లేదా? అన్నది తర్వాత సంగతి. కానీ ఈ జోడీతో దర్శక సంచలనం సందీప్ రెడ్డి వంగా సినిమా తీస్తే అదిరిపోతుందన్నది ట్రెండింగ్ లోకి వస్తోన్న అంశం. సందీప్ ఇప్పటికే ఇద్దరితో వేర్వేరుగా సినిమాలు చేసారు. విజయ్ దేవరకొండతో 'అర్జున్ రెడ్డి'..రష్మికా మందన్నాతో 'యానిమల్' సినిమాకు పనిచేసారు.కానీ వాళ్లిద్దర్నీ ఒకే ఫ్రేమ్ లో తాను మాత్రం చూపించలేకపోయారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఇద్దరితో తన మార్క్ లవ్ స్టోరీ తీస్తే అదిరిపోతుందన్నది యువతలో చర్చకు దారి తీస్తుంది. అర్జున్ రెడ్డి లో ప్రేమికుడిని... యానిమల్ లో ప్రేమికురాలిని కలిపి సందీప్ మార్క్ ట్రీట్ మెంట్ ఇస్తే మరో సంచలనం ఖాయమంటున్నారు. ఇద్దరి మధ్య ప్రేమ రన్నింగ్ చేస్తుందన్న సంగతి ఇప్పుడే అధికారికంగా తెరపైకి వచ్చి నేపథ్యంలో ఆ బాండింగ్ ఎలా సాగుతుందన్నది కాలక్రమంలో మరింత సమాచారం దొరుకుతుంది.దాని ఆధారంగా సందీప్ కథ అల్లగలిగితే బాగుంటుందని ఓ నెటి జనుడు సలహా ఇచ్చాడు.మరి సందీప్ రెడ్డి మనసులో వాళ్లిద్దరు ఉన్నారా? లేరా? అన్నది తెలియాలి. విజయ్ దేవరకొండ రష్మికా మందన్నా ఇప్పటికే కలిసి మూడు సినిమాలు చేసినప్పటికీ.. ఆ కాంబోని సందీప్ డైరెక్ట్ చేస్తే చూడాలన్నది పలువురు నెటి జనుల కోరికగా తెలుస్తోంది. ప్రస్తుతం రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో విజయ్ ఓ హిస్టారికల్ సినిమా చేస్తున్నాడు. ఇందులో రష్మికనే హీరోయన్ గా నటిస్తోంది. కానీ తాము కోరుకుంటున్నది సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్ లో అంటూ ప్రత్యేకించి మరీ అడుగుతున్నారు ఫ్యాన్స్.మరి ఇంతటి డైహార్డ్ అభిమానుల కోరిక మన్నించి సందీప్ రంగంలోకి దిగితే సరి. ప్రస్తుతం ముగ్గురు వేర్వేరుట ప్రాజెక్ట్లతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా ప్రభాస్ పాన్ ఇండియాలో భారీ ఎత్తున 'స్పిరిట్' సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నారు. విజయ్ 'రౌడీ జనార్దన్' షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. రష్మిక తెలుగు, హిందీ సినిమాలంటూ క్షణం తీరిక లేకుండా గడుపుతోంది. మరి ఇంతటి టఫ్ సిచ్యేషన్ మధ్యలో ఆ త్రయం విషయాన్ని కన్సిడర్ చేస్తారా? లేదా? అన్నది చూడాలి.

## దీపికా అవుట్.. పల్లవి ఇన్..



బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనె.. ఈ మధ్య సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న పేరిది. ప్రభాస్ నాగశ్విన్ కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ సీక్వెల్ కల్కి పార్ట్ 2 నుంచి ఈ ముద్దుగుమ్మను తప్పించడం నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. పని గంటల విషయంలో దీపికా డిమాండ్స్, యాటిట్యూడ్ కారణంగా మేకర్స్ ఆమెను తప్పించినట్లు టాక్. దీంతో సీక్వెల్ లో ఆమె పాత్ర చేయబోయేది ఎవరనేదానిపై నెట్టింట తెగ చర్చ నడుస్తోంది. దీపికా స్థానంలో పలు స్టార్ హీరోయిన్ల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలో దీనికి సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. తాజా అప్డేట్ ప్రకారం.. నటి సాయి పల్లవిని దీపికా స్థానంలో నటించేందుకు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. దీనికోసం ఆమెకు రికార్డ్ స్థాయి రెమ్యునరేషన్ కూడా ఆఫర్ చేశారట మేకర్స్ . దాదాపు రూ. 8 కోట్ల వరకు ఆఫర్ చేసినట్టు సినీ వర్గాల్లో టాక్. ఇప్పటివరకు టాలీవుడ్ లో ఈ రేంజ్ రెమ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్స్ చాలా తక్కువ మంది. అయితే మొదట దీపికా పాత్ర కోసం బాలీవుడ్ మరో స్టార్ హీరోయిన్ అలియా భట్ ను సంప్రదించారట మేకర్స్.కానీ అలియా బిజీ షెడ్యూల్స్ కారణంగా చేయలేకపోయారట. దీంతో మేకర్స్.. మరి సాయిపల్లవి ఈ ఆఫర్ ను అంగీకరిస్తుందా? లేదా అనేదానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఒకవేళ పల్లవి 'కల్కి' 2లో దీపికా పాత్ర చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే అభిమానులకు పండగనే చెప్పాలి. ప్రభాస్ పల్లవి కాంబోను స్క్రీన్ పై చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు ఫ్యాన్స్.

## సయామీ ఖేర్‌కు అరుదైన గౌరవం..



బాలీవుడ్ నటి, అథ్లెట్ సయామీ ఖేర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆమెను 'ఫేస్ ఆఫ్ ఐరన్‌మ్యాన్ ఇండియా'గా ఐరన్‌మ్యాన్ ఇంటర్నేషనల్ కమిటీ ఎంపిక చేసింది. ఏడాది వ్యవధిలో రెండుసార్లు 'ఐరన్‌మ్యాన్ 70.3' ట్రయథ్లాన్ పూర్తి చేసినందుకుగానూ ఆమెకు ఈ గౌరవం దక్కింది. నవంబరు 9న గోవాలో జరగనున్న 'ఐరన్‌మ్యాన్ 70.3' (Ironman 70.3) ట్రయథ్లాన్‌కు ఆమె అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. సయామీ ఖేర్ ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పోటీల్లో ఒకటైన 'ఐరన్‌మ్యాన్ 70.3' ట్రయాథ్లాన్‌ను ఏడాది తిరిగేలోపే రెండుసార్లు పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. 2024 సెప్టెంబర్‌లో మొదటిసారి, 2025 జులైలో రెండోసారి ఆమె ఈ రేసును విజయవంతంగా ముగించారు. అయితే, తాను ఈ పోటీలో పాల్గొన్నది రికార్డుల కోసం కాదని, తన సామర్థ్యాన్ని పరీక్షించుకోవడం కోసమేనని సయామీ స్పష్టం చేశారు.ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ అంటే మాటలు కాదు. ఇందులో పాల్గొనేవారు ఒకే రోజు వరుసగా 1.9 కిలోమీటర్లు ఈత కొట్టాలి, 90 కిలోమీటర్లు సైకిల్ తొక్కాలి, ఆ తర్వాత 21.1 కిలోమీటర్లు పరుగు పెట్టాలి. ఇంతటి కఠినమైన రేసును పూర్తి చేయడానికి అసాధారణమైన శారీరక, మానసిక స్థైర్యం అవసరం. 'ఐరన్‌మ్యాన్ 70.3' పోటీని 'హాఫ్ ఐరన్‌మ్యాన్'గా కూడా పిలుస్తారు. ఈ రేసును 'ప్రపంచ ట్రయథ్లాన్ కార్పొరేషన్' ప్రతి ఏటా నిర్వహిస్తుంది. గతేడాది సెప్టెంబరులో తొలిసారిగా ఐరన్‌మ్యాన్ 70.3 మెడల్ అందుకున్నారు సయామీ.. ఈ ఏడాది జులైలో స్వీడన్‌లో నిర్వహించిన పోటీలో కూడా తన సత్తా చాటి మరో పతకం అందుకున్నారు. తక్కువ సమయంలో రెండు సార్లు ట్రయథ్లాన్‌ను పూర్తి చేసిన తొలి భారతీయ నటిగా ఆమె రికార్డు నెలకొల్పింది. ఈ సందర్భంగా సయామీ ఖేర్ మాట్లాడుతూ... "ఐరన్‌మ్యాన్ ఇండియాకు ప్రచారకర్తగా ఉండటం నాకు దక్కిన గౌరవం. అభిరుచి, నిలకడ, వదిలిపెట్టని పట్టుదల వంటి నేను నమ్మే విలువలన్నిటికీ ఈ ప్రయాణం ఒక ప్రతీక. ఏడాదిలో రెండుసార్లు ఈ రేసును పూర్తిచేయడం రికార్డుల కోసం కాదు, నా పరిమితులను నేను సవాలు చేసుకోవడం కోసం చేశాను" అని తెలిపారు. "ఈత కొట్టే ప్రతిసారి, సైకిల్‌పై ఎత్తుకు వెళ్తున్నప్పుడు, పరుగులో వేసే ప్రతి అడుగు.. మనిషి శరీరం, మనసు ఎంత శక్తిమంతమైనవో నాకు గుర్తు చేశాయి.

## రిస్క్ అవసరమా..?



యూత్ పల్స్ పట్టి సక్సెస్ ఫుల్ సినిమాలు చేస్తూ డైరెక్టర్ గా హీరోగా సత్తా చాటుతున్నాడు కోలీవుడ్ యువ హీరో ప్రదీప్ రంగనాథ్. లవ్ టుడే తో సూపర్ సక్సెస్ అందుకున్న అతను ఈ ఇయర్ డ్రాగన్ సినిమాతో మరో సూపర్ హిట్ కొట్టాడు. ప్రస్తుతం అతను రెండు క్రేజీ సినిమాలు చేశాడు. అందులో ఒకటి విఘ్నేష్ శివన్ డైరెక్షన్ లో వస్తున్న ఎల్.ఐ.కె కాగా.. మరో సినిమా డ్యూడ్. ఈ సినిమాను కీర్తీశ్వరన్ డైరెక్ట్ చేశాడు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన డ్యూడ్ సినిమాలో ప్రేమలు బ్యూటీ మమితా బైజు హీరోయిన్ గా నటించింది. ఐతే డ్యూడ్, LIK రెండు సినిమాలు ఒకే రోజు రిలీజ్ అంటూ షాక్ ఇచ్చారు. ఈసారి దీపావళి కానుకగా అక్టోబర్ 17న డ్యూడ్ రిలీజ్ లాక్ చేశారు. ఐతే దానికి ముందే ప్రదీప్ LIK అక్టోబర్ 17 రిలీజ్ అనౌన్స్ చేశారు. డ్యూడ్ ప్రమోషన్స్ మొదలు పెట్టారు. మైత్రి మేకర్స్ సినిమా కాబట్టి ప్రమోషన్స్ దూకుడుగా ఉన్నాయి. ప్రదీప్ రంగనాథ్ సోషల్ మీడియా ఖాతాలో కూడా డ్యూడ్ కి సంబంధించిన అప్డేట్స్ ఉన్నాయి కానీ ఎల్.ఐ.కె కి సంబంధించిన అప్డేట్స్ ఏవి లేవు. ఎల్.ఐ.కె కూడా అనుకున్న డేట్ కే వస్తుందని టాక్. డ్యూడ్ తెలుగులో మంచి రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఐతే LIK వచ్చినా సరే అది తమిళ్ లో తప్ప తెలుగులో రిలీజ్ అయ్యే ఛాన్స్ లు కనిపించట్లేదు. సో డ్యూడ్, ఎల్.ఐ.కె రిలీజ్ ల పై మరోసారి క్లారిటీ రావాల్సి ఉంది. డ్యూడ్ అయితే అక్టోబర్ 17 రిలీజ్ దాదాపు కన్ ఫర్మ్ అన్నట్టే. ఇదిలా ఉంటే అక్టోబర్ 17 బాక్సాఫీస్ రేసులో కిరణ్ అబ్బవరం కె ర్యాంప్, సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా రెండు సినిమాలు వస్తున్నాయి. కె ర్యాంప్ మాస్ మూవీగా వస్తుంటే సిద్ధు తెలుసు కదా మంచి లవ్ స్టోరీగా తెరకెక్కింది. ఈ రెండిటికి పోటీగా ప్రదీప్ డ్యూడ్ కూడా ఉంది. మరి ఈ సినిమాల ఫైట్ లో ఏది ఆడియన్స్ చేత సూపర్ అనిపించుకుంటుందో చూడాలి. దీపావళికి ముందే సినిమాల పండగ వస్తుంది. ఐతే ఈ సినిమాల్లో ఏ సినిమాకు హిట్ టాక్ వస్తుందో దీపావళి రెండు రోజులు ఆ మూవీకి ప్లస్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. ఐతే ఈ సినిమాల ప్రమోషన్స్ తో ఆడియన్స్ ని తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు మేకర్స్.

"ప్రపంచమంతా స్వార్థంతో నిండిపోయింది. నేను ఒంటరి అయిపోయాను" అని మనలో మనం చాలా సార్లు అనుకునే ఉంటాం. ఇంతకీ ఒంటరి అవటం అంటే ఏమిటి? మనతో ఎవరూ లేకపోవటమే కదా. కానీ, మర్చిపోతున్న విషయం ఒకటుంది. మనమీద మనకు నమ్మకం లేనప్పుడే చిన్న ఫెయిల్యూర్‌ని కూడా భరించలేకపోతున్నాం. అంటే.. మనల్ని మనం నమ్మటం లేదు.



# ఒక ఫెయిల్యూర్ ఎదురైతేనే!

## సక్సెస్ అంటే తెలిసేది

**ఇంటర్వ్యూ, ఎగ్జామ్, స్టార్టప్ ఏదైనా కావచ్చు.. అన్నిసార్లూ మనం సక్సెస్ కాకపోవచ్చు. కానీ, అదే చివరి ప్రయత్నం కాదనే ఆలోచన రాకపోవటం.. మనమీద మనకు నమ్మకం లేకపోవడమే ఫెయిల్యూర్‌కి కారణంగా భావిస్తున్నాం. ఈ ఒక్క బలహీనత మీద పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పేరుతో వందల కోట్ల బిజినెస్ జరుగుతోంది. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ మీద వచ్చిన పుస్తకాలు కానీ, జరిగే క్లాసులు కానీ.. మొత్తంగా చెప్పేది ఒక్కటే. 'మిమ్మల్ని మీరు నమ్ముకోండి.. మీలో ఉన్న శక్తే మిమ్మల్ని నడిపిస్తుంది' అని.**

### పరాజయాలు.. పాఠం నేర్పటానికే..

ఏదైనా చేయాలనకున్నప్పుడు మనకు సలహాలిచ్చేవాళ్లు వందల్లో ఉంటారు. కానీ, వాటిలో ఏది ఫాలో అవ్వాలో మనకు మాత్రమే తెలుస్తుంది. పుట్టిన దగ్గరినుంచీ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉంటాం. కానీ ఒక్క ఫెయిల్యూర్‌కే కుంగిపోవటం ఎందుకు? అన్న ప్రశ్న చాలు మళ్లీ మనం లేచి నిలబడేందుకు. ఎవరు ఏది చెప్పినా మన నిర్ణయమే చివరిది అనుకున్నప్పుడు అప్పటిదాకా ఉన్న డిప్రెస్డ్ ఫీలింగ్ కనిపించదు. పసి ప్రాయంలో ఒక్క అడుగు వేయలేక కిందపడ్డ వాళ్లే.. నేడు ఎవరెస్ట్ శిఖరాన్ని తమ కాళ్ల కింద చూసుకుని ఆనందిస్తున్నారు. పరాజయాలు ఉన్నదే మనకు పాఠం నేర్పటానికి. ప్రపంచాన్ని ప్రభావితం చేయగల వ్యక్తులు చాలామంది అలాంటి పాఠాలు నేర్చుకున్నవాళ్లే.





### సోనీ.. ఇలా మొదలైంది..

రెండో ప్రపంచ యుద్ధం నుంచి తేరుకున్న జపాన్‌లో మసారు ఇబుకా, అకియో మోరిటా కలిసి ఓ ఎలక్ట్రానిక్ రైస్ కుక్కర్‌ను తయారు చేశారు. ఆ కుక్కర్ పనితీరు ఏమాత్రం బాగుండేది కాదు. అందులో అన్నం వండితే ఒక్కోసారి సరిగ్గా ఉడికేది కాదు. తినడానికి వీల్లేకుండా తయారయ్యేది. అయినా వాళ్లిద్దరూ వెనకడుగు వేయలేదు. ఎంతో కష్టపడి లోపాలను సరిదిద్దారు. అంతా కష్టపడ్డా వారు అమ్మగలిగింది వంద కుక్కర్లు మాత్రమే! ఈ ఎదురుదెబ్బల నుంచి నేర్చుకున్న పాఠాలతోనే వారు ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంస్థ 'టోక్యో త్సుషిన్ కోగ్యో'ను మొదలుపెట్టారు. అదే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన సోనీ.

### హ్యారీపోటర్‌ను వద్దు పొమ్మన్నారు..


జేకే రౌలింగ్ రాసిన 'హ్యారీపోటర్' నవల ప్రపంచవ్యాప్తంగా ఎంత పాపులరో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ, హ్యారీ పోటర్ సిరీస్‌లో మొదటి నవల 12 సార్లు రిజెక్ట్ అయ్యింది. అయినా.. ఆ రిజెక్షన్‌లే రౌలింగ్‌కు పాఠం నేర్పాయి. అమెరికన్ రచయిత స్టీఫెన్ కింగ్స్ రచించిన మోస్ట్ పాపులర్ నవల 'క్యారీ' 30 సార్లు రిజెక్ట్ అయ్యింది. ఈ నవల విడుదలైన తర్వాత కూడా అందులో ఉండే కంటెంట్ చాల భయంకరంగా ఉందనే కారణంతో దీన్ని యునైటెడ్ స్టేట్స్ లో ఉన్న అన్ని స్కూళ్లలో నిషేధించారు.






### 3వేల సార్లు ఫెయిల్యూర్..

ఫెయిల్యూర్స్ ఎదురవటం అంటే మన గెలుపునకు బలమైన పునాది పడుతున్నట్టే. అందుకు విద్యుత్ బల్బ్ తయారీ కోసం థామస్ అల్వా ఎడిసన్ పడిన తపన ఓ ఉదాహరణ. ఎలక్ట్రిక్ బల్బ్ నుంచి వెలుతురు చూసేందుకు థామస్ ఎడిసన్ దాదాపు 3వేల సార్లు ఫెయిలయ్యాడు. అయినా ప్రయత్నాలు ఆపలేదు. ఆఖరికి అనుకున్నది సాధించాడు.



### ఒకప్పుడు రిజెక్ట్ అయినవాళ్లే..

ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు సక్సెస్ ఫుల్ అనిపించుకున్న వాళ్లంతా ఒకప్పుడు రిజెక్ట్ అయినవాళ్లే.. మన టాలెంట్ గురించి పెట్టుకున్న నమ్మకాలు చెదిరిపోయేలాంటి ఓటమి ఎదురైతే ఎవరైనా జంకుతారు. కుంగిపోవడం, ఆ పనుల నుంచి పూర్తిగా తప్పుకోవడం, డిప్రెషన్‌లోకి వెళ్లిపోవడం కనిపిస్తుంటుంది. కానీ, చరిత్రలో తిరుగులేని విజయాలు సాధించిన ఏ మనిషి జీవితం చూసినా సక్సెస్ వెనుక వందలకొద్దీ ఫెయిల్యూర్స్ ఉంటాయి. కానీ, ఫెయిల్యూర్స్ లేకపోతే ఈ సక్సెస్ ఉండేది కాదని కూడా గమనించాలి. సామాన్యంగా ఏ మనిషికీ పుట్టుకతోనే అద్భుతాలు చేసే శక్తి ఉండదు. ఒక గొప్ప పని చేయడానికి ఓ పది లక్షణాలు కావాల్సి వస్తే.. మహా అయితే అందులో ఓ అయిదారు ఉంటాయి. మిగతావి మనం ఫెయిల్యూర్స్ నుంచి నేర్చుకునేవే.

### కుక్క మాంసాన్ని తిని..

వాల్ట్ డిస్నీ మొదటి యానిమేషన్ సంస్థ 'న్యూమన్ లాఫ్ ఓగ్రామ్'.. 1920లో ఈ సంస్థ తీవ్రమైన ఫైనాన్షియల్ క్రైసిస్‌లో పడింది. ఎంతగా అంటే.. కనీసం రెంట్‌లు కూడా చెల్లించలేని పరిస్థితి ఎదురైంది. కడుపు నింపుకునేందుకు బలవంతంగా కుక్క మాంసాన్ని తినేవాడట వాల్ట్ డిస్నీ. అలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్న ఆయన 1966లో చనిపోయే నాటికి.. ప్రస్తుత మన లెక్కల్లో చెప్పుకోవాలంటే దాదాపు 32వేల కోట్ల రూపాయలు సంపాదించారు.

### ఫస్ట్ అటెంప్ట్‌లోనే ఫెయిల్యూర్...

ప్రపంచ సంపన్నుల్లో ఒకరైన బిల్‌గేట్స్ అంటే అందరికీ తెలిసిన వ్యక్తే. మైక్రోసాఫ్ట్ ఫౌండర్‌గా అయన అంటే అందరికీ గౌరవం. కానీ, తాను తొలిసారి ఎంటర్‌ప్రిన్యూర్‌గా మొదలెట్టిన డేటా ప్రాసెస్ అండ్ ఎనలైజ్ చేసే కంపెనీ 'ట్రాఫ్ ఒ డేటా' డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత దాన్నుంచి కోలుకుని ఎన్నో కొత్త ఆలోచనలతో మైక్రోసాఫ్ట్ కంపెనీ ప్రారంభించారు. అది ఇప్పుడు ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఆ తర్వాత విజయపరంపరతో ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలిచారు.




### వీళ్లంతా ఫెయిల్యూర్ చూసినవాళ్లే..

హ్యారీపోటర్ రచయిత జె.కె.రౌలింగ్, రివల్యూషనరీ యాపిల్ సంస్థ అధినేత స్టీవ్ జాబ్స్, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, విద్యుత్ బల్బ్ కనిపెట్టిన థామస్ ఎడిసన్, అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్, బాస్కెట్‌బాల్ లెజెండ్ మైఖేల్ జోర్డాన్, మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ ఫిల్మ్ మేకర్ స్టీవెన్ స్పీల్‌బర్గ్, మిక్కీ మౌస్ క్రియేటర్ వాల్ట్ డిస్నీ, పెయింటింగ్ ఆర్టిస్ట్ విన్సియెంట్ వాన్‌గో, హారర్ నవలా రచయిత స్టీఫెన్ కింగ్.. వీళ్లంతా ఫెయిల్యూర్స్‌ని ఎదుర్కొన్నవాళ్లే.. ఎన్నో ప్రయత్నాల తర్వాత వాళ్లు సక్సెస్‌ను చూశారు.




# కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన ఉండాలి

- రైతుల సందేహాలను నివృత్తి చేయాలి
- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐ) ద్వారా పత్తి రైతుల ప్రయోజనాల కోసం జారీ చేయబడిన కనీస మద్దతు ధర ప్రయోజనాలను పొందడానికి పత్తి రైతులం దరికీ 'కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవడానికి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా సంబంధిత శాఖ అధికారుల ఆదేశించారు. దీనిపై సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో పూర్తిగా అవగాహన చేసుకొని, రైతులకు సహయ సహకారాలు అందించాలని సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆద్వర్యంలో సోమవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని వ్యవ సాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు కపాస్ కిసాన్‌యాప్ ద్వారా స్లాట్ బుకింగ్, కౌలు రైతుల రిజిస్ట్రేషన్ చేయుట పై అవగాహన, శిక్షణా కార్యక్రమం రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియం లో ఏర్పాటు చేసారం దీనికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి పద్మావతి కాపాస్ కిసాన్ మొబైల్ యాప్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025- పంట సంవత్సరంలో మద్దతు ధర క్రింద సీసీఐకి పత్తి అమ్మడానికి, గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటులో ఉన్న 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. సందేహాలకు, సలహాలకు రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 18005995779కు కాల్ చేయాలనీ సూచించారు. ఈ ఏడాది పంట విక్రయానికి సంబంధించి మార్పులు, చేర్పులు చేయడం జరిగిందని, పత్తి కొనుగోలుకు సీసీఐ కొత్త నిబంధనలను ఏర్పాటు చేసిందని, రైతుల వివరాలు, స్లాట్ బుకింగ్ చేసుకోవలసి ఉన్నందున ఈ నిబంధనల వల్ల రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉండటంతో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఎటువంటి అనుమానాలు ఉన్న టోల్ ఫ్రీ నెంబర్‌కు గాని, అధికారులను గాని సంప్రదిస్తే అనుమానాలను నివృత్తి చేస్తారని ఆయన తెలిపారు.



# ఆదిలాబాద్ పట్టణంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన





**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా భగత్‌సింగ్ నగర్‌లో నిర్మిస్తున్న కేంద్రీ య విద్యాలయ భవనాన్ని పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించేందుకు పబ్లిక్ హెల్త్ ఈఈ, మున్సిపల్ కమిషనర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, విద్యుతాశాఖ ఎస్ ఈ, కేవీకే ప్రిన్సిపాల్‌తో కూడిన కమిటీని నియమించారు. అనంతరం రూ. 12.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న హరిఓం నగర్ బ్రిడ్జి ప్రాంతాన్ని, తాత్కాలిక వంతెనను పరిశీలించారు. పనులు త్వరితగతిన చేపట్టి నాణ్యతతో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి తిర్పెల్లి రామా లయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అబ్దుల్లా చౌక్‌ను సందర్శించి కాలనీలో తాగునీటి సమస్యకు గల కారణాలపై ఆరా తీశారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాల్మీకినగర్‌లో టీయూ ఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించారు. గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈ పేరిరాజు, పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్, ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహన్, ఆర్అండ్ బీడీఈ రమేశ్ తదితరులున్నారు.





# న్యాయవాదుల విధుల బహిష్కరణ

**లక్షెట్టిపేట, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ న్యాయవాది గుల్ల రమేష్ పై దాడికి నిరసన తెలుపుతు విధులు బహిష్కరించారు. న్యాయవాదులపై దినదినం పెరుగుతున్న దాడులను ఖండిస్తూ న్యాయవాద రక్షణచట్టం కొరకు డిమాండ్ చేస్తున్నట్టు న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న ఉపాధ్యక్షుడు నళిని కాంత్ జాయింట్ సెక్రటరీ సత్యగౌడ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రెడ్డిమల్ల ప్రకాశం సదాశివ సీనియర్ న్యాయవాదులు కారుకూరి సురేందర్ అక్కల శ్రీధర్ గోవిందరావు గడికొప్పుల కిరణ్ కుమార్ నగరు రవీందర్ షఫీక్ పద్మ తాజోద్దీన్ ఆనందబాబు గణేష్ రుమాన్ షెఫీక్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను
# ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కాగజ్‌నగర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే హరీశ్ బాబు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం ఆధ్వ ర్యంలో రెబ్బెన మండలానికి చెంది న బీఆర్ఎస్ నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా బొడ్డు మౌనిక, నానవేణి మల్లేశ్, బొడ్డు రాజ్‌కుమార్, గంగాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇగురపురమేశ్ బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నపూర్ణ, నాయకులు సుదర్శన్ గౌడ్, సునీల్, కుందారపు బాలకృష్ణ, సొల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్



- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- బాధితుల ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు
- 32 ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి ఆదేశాలు

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 32 మంది అర్జీదారులు రాగా బాధితుల సమస్యలను ఎస్పీ ఓపికగా విన్నారు. సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల వారు నేరుగా 8712659973 నంబరు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా పోలీసు ముఖ్య అధికారిని కలవడానికి వచ్చిన బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వయంగా నేరుగా విని, సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడు, సత్వర న్యాయం చేసినప్పుడు పోలీసు వ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని సూచించారు. ఎలాంటి సందర్భంలోనైనా జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల సేవలకై అందుబాటులో ఉంటూ విధులను నిర్వర్తిస్తుందని సూచించారు. అందిన ఫిర్యాదులలో భూ సమస్యలు, నకిలీ దస్త్రావేజులతో రిజిస్ట్రేషన్ల సమస్యలు, కుటుంబ కలహాలు, భార్యాభర్తల సమస్యలు, పోలీస్ స్టేషన్లో కేసుల పురోగతి, తదితర అంశాలు స్వీకరించబడినవి వాటితో పాటు సివిల్ తగాదాలు తదితర విషయాలలో చట్ట ప్రకారం నడుచుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్
# వేతనాలు చెల్లించాలి

**శ్రీరాంపూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ 4నెలల వేతనాలు చెల్లించాలని జిల్లా నాయకుడు మహేశ్ వర్మ డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోచుకుంటున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. జీతాలు చెల్లించలేని కాంట్రాక్టర్ల లైసెన్సులను రద్దుచేసి, బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు.



# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు





- ఎన్నికలకు పూర్తిగా సంసిద్ధమై ఉండాలి ■ ఎన్నికల నియమావళి, నిబంధనలపై సిబ్బందికి సూచనలు
- ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు చేపట్టాలి ■ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు పాటించాలి..
- జిల్లాలో చెక్ పోస్టుల ఏర్పాటు ■ డబ్బు, మద్యం, ఎన్నికలను ప్రభావితం చేసే బహుమతుల రవాణా నిషేధం.
- సమస్యలను సృష్టించే వారిని బైండోవర్ చేయాలి ■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు హెడ్‌క్వార్ట్స్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని స్టేషన్‌ల అధికారులు, సీఐలు, డీఎస్పీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికలకు సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఇదివరకే చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం, ఎన్నికలను ప్రభావితం చేసే బహుమతులు రవాణా కాకుండా చూడాలన్నారు. సమస్యలను సృష్టించే వారిని, రౌడీలను, బైండోవర్ చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం, వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడానికి ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు నేరస్తులను, సమస్యలను సృష్టించే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల నుండి, అక్రమంగా మద్యం, డబ్బు, ఎన్నికలను ప్రభావితం చేసేలా ఉండేటువంటి బహుమతులను రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళిని పోటీ చేసే ప్రతి ఒక్కరు పాటించాలని నిబంధనలు, ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలలో ఫ్లయింగ్ స్పాట్స్, ఎస్ఎస్‌టి టీమ్స్, ఎఫ్ఎస్‌టి టీమ్స్ ఏర్పాటు చేసి నిబంధనలు అతిక్రమించకుండా పర్యవేక్షించడం జరుగుతుంది. సమసాత్మక ప్రాంతాలను, సమసాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలకు ముందుగానే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఎక్కువ బందోబస్తు సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి ఆవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్నటువంటి గన్ లైసెన్సులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిపై తగు చర్యలను చేపట్టాలన్నారు. ఎలాంటి సమావేశాలు, సభలు ఏర్పాటు చేయాలన్న ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధనను పాటించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లను సెక్టార్ల వారీగా విభజించి రూట్ బందోబస్తును సక్రమంగా నిర్వర్తించేలా సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీలు శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్హెచ్ఓలు, డిసిఆర్‌బి, స్పెషల్ బ్రాంచ్, ఐటికోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాం మందిరంలో కలెక్టర్ పూజలు

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని తిరుపల్లి రామ్ మందిర్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చిన ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## చదువు అభివృద్ధికి పునాది



**ఉట్నూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

చదువుతో అభివృద్ధికి పునాదని, సెలవులు పూర్తయిన నేపథ్యంలో విద్యార్థినులను కళాశాలకు పంపాలని ఉట్నూరు పట్టణంలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు బుర్ర మానస కోరారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ హరిత ఆదేశాల మేరకు సోమవారం ఉట్నూర్ మండలంలోని టక్కుగూడ, శ్యాంపూర్ గ్రామాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె క్వెస్ట్ కార్యక్రమంలో పది అంశాలను తెలిపారు.

## చెట్ల తొలగింపునకు బహిరంగ వేలం

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని గాంధీ పార్క్‌లో గల ఉసిరి బ్లాక్ పెరిగిన సుబాబుల్, గుల్మార్ చెట్ల తొలగింపునకు ఈనెల 10న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పార్క్ ఆవరణలో నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు రూ. లక్ష ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. 8977713928, 9440765485,98499130613 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

# కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్





**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ భవనాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం పరిశీలించారు. భవన నిర్మాణ నాణ్యతను తనిఖీ చేయడంతో పాటు, ప్రధాన కార్యాల యం సమర్పించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుకు అనుగుణంగా నిర్మాణం కొనసాగుతున్నదా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీలో ఇఇ ఆర్ అండ్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్ మెంట్, మున్సిపల్ కమిషనర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, ఎస్ఇ ఎన్పిడిసిఎల్, అశోక్ అటుకాపురం, ప్రిన్సిపాల్ ఐ/సి, కేవీ ఆదిలాబాద్ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో సిపిడబ్లుడి తరఫున, ఎఇ - సివిల్, ఎఇ - ఎలక్ట్రిక్రల్, సైట్ ఇంజనీర్ హాజరై, ప్రాజెక్ట్ పురోగతిపై వివరణ ఇచ్చారు. కలెక్టర్ నిర్మాణ నాణ్యతకు సంబంధించి అవసరమైన సూచనలు అందిస్తూ, విద్యార్థులకు భవిష్యత్‌లో సరైన పాఠశాల వాతావరణం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉద్దేశించిన విధంగా, కేంద్రీయ విద్యాలయం విద్యా ప్రమాణాలకు తగిన వసతులతో నిర్మితమవుతుందని ధృవీకరించేందుకు కమిటీ పనిచేస్తుందని, ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

# టికెట్లు దక్కేదెవరికో..?

- ఒక్కో స్థానానికి ముగ్గురు అభ్యర్థుల ఎంపిక
- గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ పెద్దపీట
- అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా ప్రభుత్వానికి జాబితా

**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

స్థానిక ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ఎంపికలో అధికార పార్టీ ఆచితూచి అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కావడంతో గెలుపు అవకాశాలు కాంగ్రెస్‌కే ఉన్నప్పటికీ ఎక్కడా కూడా అవకాశం వదులు కోకూడ దనే పట్టుదలతో అధిష్టానం ఉంది. ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ కావడంతో అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేల భుజస్కందాలపై పడింది. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసి సంవత్సరం దాటినందున ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయాలను అధిష్టానం ఇప్పటికే సేకరించింది. ఆ నివేదిక ప్రకారం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలనే సూచనలు జారీ చేసింది. ఒక్కో స్థానానికి కనీసం ముగ్గురు బలమైన, ప్రజాధారణ కలిగిన అభ్యర్థులను ఎన్నుకోనున్నారు. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక ఓ కొలిక్కిరాగా ఎమ్మెల్యేలు అందజేసే తుది జాబితా జిల్లా ఇంచార్జి మంత్రి ద్వారా ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందనుంది.

**తుది నిర్ణయం అధిష్టానిదే...**

ప్రతి స్థానానికి ముగ్గురు చొప్పున తయారు చేసిన అభ్యర్థుల జాబితా జిల్లాల నుంచి రాగానే అధిష్టానం తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ము గ్గురు ప్రతిపాదిత అభ్యర్థుల నుంచి ఒకరిని ఎంపిక చే సి, తిరిగి జిల్లాలకు పంపనున్నారు. అధిష్టానం సూచించిన అభ్యర్థికి పార్టీ టికెట్‌ను అందజేయనున్నారు. తద్వారా వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకోవడం కోసం ఒక నిర్దిష్టమైన ప్రణాళికను అమలు చేస్తున్నారు. త ద్వారా ప్రతిపక్ష పార్టీలకు స్థానిక ఎన్నికల్లో అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**ఎమ్మెల్యేల చుట్టు ప్రదక్షిణలు...**

మొదటి విడుతలో జరుగబోయే జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలకు సంబంధించి టికెట్ల కోసం ఆశావహులు ఎ మ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అనుకూలించి, గతంలో పోటీచేసి విజయం సాధించినవారు మరోసారి అవకాశం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేయగా, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుండటంతో కొత్తవారు కూడా పోటీ చేయాలనే కుతూహలంతో ఉన్నారు. ఇదిలా ఉండగా మండల, జిల్లా పరిషత్ ఎన్నిల నోటిఫికేషన్ ఈ నెల 9న విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభం కానుండగా, 11వ తేదీతో ముగుస్తుంది. నోటి ఫికేషన్ విడుదలైన తరువాత కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అప్పటిలోగా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయడమేగాకుండా, నామినేషన్లు కూడా దాఖలు చేయాల్సి ఉంది. నామినేషన్ దాఖలు గడువు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ అధిష్టానం సైతం అభ్యర్థుల ఎంపిక వేగవంతం చేసింది.

**జడ్పీ పీఠం దక్కేదెవరికో....?**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి విడుతలో జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పీఠం రిజర్వేషన్‌లో భాగంగా బీసీ మహిళకు కేటాయించారు. జిల్లాలో 16 మండలాలు ఉండగా 10 స్థానాల్లో బీసీ మహిళలు పోటీపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా పరిషత్ చైర్మన్ పదవి వరించనుండటంతో బీసీ జన రల్ స్థానాల్లోనూ మహిళలనే రంగంలోకి దింపాలనే ఆలోచనతో ముఖ్యనాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి కోసం జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలో అధికార కాంగ్రెస్‌కు చెందిన బీసీ మహిళలు పోటీకి సిద్ధపడుతున్నారు. ఇందులో భాగంగా తమకే టికెట్ కేటాయించేలా నియోజకవర్గ ఎమ్మెల్యేలైన కొక్కిరాల ప్రేంసాగర్‌రావు (మంచిర్యాల), గడ్డం వివేకానంద (చెన్నూరు), గడ్డం వినోద్ (బెల్లంపల్లి)ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాధారణ ఉన్న నాయకులు జిల్లా పరిషత్ పీఠం కోసం దస్తీ వేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ పీఠాన్ని దక్కించుకోవడం ముగ్గురు ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారింది. దీంతో జడ్పీటీసీ సభ్యుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## భీం వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి

- జోడే ఘాట్‌లో చకచక దర్బార్ వేదిక ఏర్పాటు
- భక్తి శ్రద్ధలతోత అవ్వల్ పేన్ పూజ
- జోడేఘాట్‌కు చేరిన వంశస్తులు

**కెరమెరి, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
కెరమెరి మండలం జోడేఘాట్లోఓ కుమురం భీం వంశస్తులు సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో అవ్వల్‌పేన్ పూజ నిర్వహించారు. మొదట భీం సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. సమాధి, నాలుగు జెండాలకు పూజలు చేశారు. అనంతరం పోచమ్మ తల్లికి గొర్రె పోతును బలిచ్చి మొక్కు తీర్చుకున్నారు. సంప్రదాయం ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు భీం మనుమడు సోనేరావు తెలిపారు. నిజాం సైనికులతో చేసిన పోరాటంలో సాయంగా నిలిచిన అవ్వల్పన్(పోచమ్మ)కు ఏటా భీం వర్ధంతికి ముందు రోజు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేయగా, గోత్రాలకు చెందిన ఆదివాసీలు హాజరయ్యారు.

**కుమరం భీం వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి...**
కెరమెరి మండలం జోడేఘాట్‌లో మంగళవారం నిర్వహించనున్న కుమరం భీం వర్ధంతి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఏర్పాట్లను ఏఎస్పీ చిత్తరంజన్ పరిశీలించారు. వర్ధంతి సభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి భారీగా గిరిజనులు తరలిరానున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐటీడీఏ, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వర్ధంతి సభకు పలువురు మంత్రులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

**శానిటేషన్ పనుల పరిశీలన..**
శానిటేషన్ పనులను డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ సోమవారం పరిశీలిం చారు. హట్టి బేస్ క్యాంపు నుంచి జోడేఘాట్ వరకు పనులు చేపడుతు న్నారు. వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురికావడంతో ఆయా ప్రదేశాల్లో బారికేడ్లను ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అడిషనల్ డీఎం హెచ్‌వో మనోహర్, ఎంపీడీవో అంజద్ పాషా ఏర్పాట్లను పరిశీలించారు.

**భీం వర్ధంతికి పటిష్ట బందోబస్తు : ఏఎస్పీ చిత్తరంజన్**
కుమరం భీం వర్ధంతి సందర్భంగా కెరమెరి మండలం జోడేఘాట్ ప్రాంతంలో పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామని ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మంగళవారం జరగనున్న కార్యక్రమానికి మొత్తం 462 మంది పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించామని, ఇద్దరు డీఎస్పీలు, ఎని మిది మంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 51 ఏఎస్సైలు, 136 మంది కానిస్టేబు ళ్లు, 56 మంది మహిళా కానిస్టేబుళ్లు, 79 మంది హోంగార్డులతో బందోబస్తు చేయనున్నట్టు తెలిపారు. ప్రముఖ ప్రదేశాలు, వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ, వసతి సదుపాయాల వద్ద ప్రత్యేక పహారా బృందాలు, ట్రాఫిక్ నియంత్రణ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డీఎస్పీ వాహిదుద్దీన్, సీఐ సత్యనారాయణ, ఎస్సైలు మధుకర్ పాల్గొన్నారు.



# ‘సరిహద్దు’లో అత్యవసర సేవలు అందేదెప్పుడు?

**ముథోల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్న ముథోల్ నియోజకవర్గంలో అత్యవసర వైద్యసేవలు అందించే స్థాయి ఆస్పత్రులు లేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, ఏడు మండలాలున్నాయి. భైంసాలో ఏరియాస్పత్రి ఉండగా, ముథోల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్సీ) ఉంది. ఇక బాసర ప్రైమరీ హెల్త్ సెంటర్ (పీహెచ్సీ)ను సీహెచ్సీగా అప్గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ ఇందుకు అనుగుణంగా ఇప్పటివరకు సిబ్బందిని నియమించలేదు. తానూరు, కుభీర్, కుంటాల, లోకేశ్వరం మండలాల్లో పీహెచ్సీలే ఉండగా ఆయా మండలాల ప్రజలకు వైద్య సేవలు అంతంత మాత్రం గానే అందుతున్నాయి. నియోజకవర్గంలో తండాలు అధికంగా ఉన్నాయి. అత్యధికంగా నిరుపేదలు ఉండే ఈ నియోజకవర్గంలో వైద్యం కోసం పక్కనే ఉన్న మ హారాష్ట్రకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. తానూ రు, ముథోల్, బాసర మండల వాసులు మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు, కుభీర్, భైంసా మండల వాసులు నాందేడకు, కుంటాల మండలవాసులు నిర్మల్, లోకేశ్వరం మండలవాసులు నిజామాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. పీహెచ్సీలను సీహెచ్సీలుగా అప్‌గ్రేడ్ చేస్తే ఈ ఇబ్బందులు తప్పనున్నాయి. సీహెచ్సీల్లో సూపరింటెండెంట్, ఆర్ఎంవోలతో కూడిన వైద్యబృందం అందుబాటులో ఉండనుండగా అత్యవసర సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇక మిగతా సిబ్బంది సంఖ్య కూడా పెరగనుండడంతో పేషెంట్లకు అవసరమైన అన్ని రకాల సేవలు అందే అవకాశముంది. భైంసా మున్సిపాలిటీలో ఏరియాస్పత్రి ఉంది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఈ ఆస్పత్రి బస్టాండు దగ్గరగా ఉంది. నియోజకవర్గంలో ఎక్కడ రోడ్డు ప్ర మాదం జరిగినా క్షతగాత్రులు ఇక్కడికే రావాల్సి వస్తోంది. ఆత్మహత్యలకు పాల్పడ్డా పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఇక్కడికే తెస్తుంటారు. ఈ ఆస్పత్రి భవనం ఇరుకుగా ఉంది. ప్రస్తుతమున్న ఒకే భవనంలో ప్రసూతి విభాగం, అత్యవసర వైద్యసేవలు, టీబీ విభాగం, రక్తనిధి కేంద్రం, ఆపరేషన్ థియేటర్లున్నాయి. మరో ఆస్పత్రి ఏర్పాటు చేస్తేనే వైద్యసేవలు అందే అవకాశముంది.

## కొమరం భీం వర్ధంతికి 462 మందితో బందోబస్తు



**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
కొమరం భీం వర్ధంతికి జోడేఘాట్‌లో 462 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అసిఫాబాద్ ఏఏస్పీ చిత్తరంజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. 2 డీఎస్పీలు 8, సీఐలు 25, ఎస్సైలు 51, ఎస్సైలు 136 మంది కానిస్టేబుల్స్, 56 మంది మహిళ కానిస్టేబుల్స్‌ను నియమించినట్లు వెల్లడించారు.

**రాష్ట్ర స్థాయి పండుగగా కొమరం భీమ్ వర్ధంతి..**
ఆదివాసీల ఆరాధ్య దైవమైన కొమరం భీమ్ వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించారని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న అధికారికంగా జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ ప్రాంతంలో కొమరం భీం వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈమెర ఈ మేరకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

## ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత



**కడెం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో జిల్లాలోని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. కడెం, గడ్డెన్న వాగు, స్వర్ణ ప్రాజెక్టుల గేట్లు ఎత్తారు. కడెం ప్రాజెక్టుకు సోమవారం 10,337 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు రెండు వరద గేట్లు ఎత్తి 13,494 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే భైంసా పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు 22 వేలక్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్ట్ అధికారులు మూడు గేట్లు ఎత్తి 22,681 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సారంగపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి 1,100 క్యూసెక్కుల వరద రావడంతో నీటిని దిగువకు వదులుతున్నారు.





## బాక్సింగ్ ఎంపిక పోటీలు

**మంచిర్యాల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ఓఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం అండర్-17 బాలబాలికల జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను పా ఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి రమేశ్ ప్రారంభించగా వివిధ పాఠశాలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొమ్మిది మంది ఎంపికయ్యారని, ఈనెల 8న నిర్మల్లో నిర్వహించే జోనల్ పోటీలలో పాల్గొంటారని ఎస్ఓఎఫ్ సెక్రటరీ యాకుబ్ తెలిపారు. పోటీల పర్యవేక్షకుడు రేణి రాజయ్య, వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు

**ముథోల్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
బాసర ఆర్జీయూకేటీ కళాశాలలో డిసెంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ చాన్సలర్ గోవర్ధన్ తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మకత పెంపొందించేందుకు ఇలాంటి సమ్మేళనాలు ఉపయోగపడతాయన్నారు. 1977లో పద్మశ్రీ డా.కిరణ్ సేత్ ఢిల్లీ ఐఐటీలో ప్రారంభించిన స్పిక్ మెకే దేశవ్యాప్తంగా యువతను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. సంగీతం, నృత్యం, జానపద కళలు, హస్తకళలు, చిత్రకళలతో పాటు భారతీయ తాత్విక విలువలను చేరవేయడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి కళాకారులు రానున్నట్లు తెలిపారు.

## ‘నవోదయ’లో ప్రవేశానికి నేటితో ముగియనున్న గడువు


**కాగజ్‌నగర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి మంగళవారంతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 678 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఎనిమిదో తరగతి, పదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## జాతీయ మహాసభల్లో జిల్లా ఉపాధ్యాయులు




**ఇచ్చోడ, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
రాజస్థాన్‌లోని జండోలి ఏబీఆర్ఎస్ఎం జాతీయ మహాసభల్లో టీపీయూఎస్ జిల్లా బాధ్యులు సోమవారం పాల్గొన్నారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షానిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మహాసభలను చేపడుతున్నారు. ఇందులో జాతీయ నూతన విద్యా విధానం, టెట్ సమస్య పరిష్కారం, పాత పెన్షన్ విధానం అమలు, సర్వీస్ రూల్స్, బడ్జెట్‌లో విద్యకు అధిక ప్రాధాన్యం, దేశ వ్యాప్తంగా ఒకే పీఆర్సీ, ఎస్జీ టీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు తదితర అంశాలపై చర్చించారు. ఈ మహాసభల్లో టీయూపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునిల్ చౌహాన్, గోపీకృష్ణ, కిరణ్, మనోజ్ రెడ్డి, జిజాబాయి, సంగీత తదితరులున్నారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షానిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలో జిల్లా ఉ పాధ్యాయులు పాల్గొనడంపట్ల పలువు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.





# హమ్మయ్యా

- రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో ఊరట
- జీవో-9పై దాఖలైన పిటిషన్ డిస్మిస్
- హై కోర్టులోనే తేల్చుకోవాలని సూచన
- హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- ఇప్పటికే స్థానిక పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు
- రిజర్వేషన్‌లు మారుతాయంటూ రోజుగా ప్రచారం
- హై కోర్టు తీర్పు తర్వాతనే పల్లె రాజకీయ సందడి..
- రిజర్వేషన్ల నిర్ణయంపై అందరి దృష్టి
- 8వ తేదీన హైకోర్టులో విచారణ

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.9పై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ డిస్మిస్ అయింది. ఈ అంశాన్ని ముందుగా తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం కోర్టు పిటిషనర్‌కు సూచించింది. 50 శాతం పరిమితిని మించి రిజర్వేషన్లు ఉన్నాయని పిటిషనర్ వాదించగా సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ అంశాన్ని ముందుగా తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు పిటిషనర్‌కు సూచించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారణ జరిపింది. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన వంగా గోపాల్ రెడ్డి ఈ రిజర్వేషన్ల జీవోను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తన వాదనలో కీలక అంశాలను ప్రస్తావించారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయగా.. ఇప్పటికే ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు. ఈ మొత్తం రిజర్వేషన్లు కలిపితే 67 శాతానికి చేరుతాయని.. ఇది మొత్తానికీ 50 శాతం పరిమితిని మించి ఉంటుందని గోపాల్ రెడ్డి తరపు న్యాయవాది వాదించారు. అంతేకాకుండా ఈ రిజర్వేషన్లు పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285కి విరుద్ధమని, ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయని ఆయన వాదించారు. ఈ జీవోపై హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించిందన్నారు. ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే తీవ్రనష్టం జరిగే ప్రమాదం ఉందని.. కాబట్టి అత్యవసరంగా జోక్యం చేసుకుని జీవో అమలుపై స్టే ఇవ్వాలని కోరుతూ పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అయితే అత్యున్నత న్యాయస్థానం ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోలేదు.

**హైకోర్టు స్టే ఇవ్వకుంటే వచ్చేస్తారా..**

సుప్రీం కోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలు అయిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అం శంపై 2 పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, సిద్దార్థ దవే, ఏడీఎన్ రావు అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరపు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వ నందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసింది. ఇక 8వ తేదీన హైకోర్టులో కేసు విచారణకు రానుండగా ఎలాంటి తీర్పు వస్తుందోనని వేచిచూస్తున్నారు.

**అప్రమత్తమైన సర్కార్...**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోపై సోమవారం సుప్రీం కోర్టులో, 8న హైకోర్టులో విచారణ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. స్థానిక సంస్థల ఎన్నికల తొలి దశ నోటిఫికేషనన్ను ఈ నెల 9న జారీ చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు జారీ చేసిన జీవోపై సుప్రీంకోర్టులో జరగ నున్న విచారణపై ఉత్కంఠ నెలకొంది. ఈ జీవో చెల్లు బాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటు అధికారులను, అటు పార్టీ నేతలను ఆదేశించారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**తానూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బెలరోడా చెక్‌పోస్టు వద్ద రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మహారాష్ట్రలోని ఉమ్రి గ్రామానికి చెందిన బోంద్రే సాయినాథ్ (26) తానూరులో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా బెల్‌తరోడా చెక్‌పోస్టు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్న బంధువులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## కారును ఢీకొట్టిన కంటైనర్

**ఇచ్చోడ, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం 44వ జాతీయ రహదారిపై కంటైనర్ కారును ఢీ కొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయపడ్డారు. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారును కంటైనర్ లారీ వెనకు నుంచి ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కారులో నలుగురు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.



## భారీ వర్షంతో నిండా మునిగిన రైతులు

**ఇచ్చోడ, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

రెండు నెలల నుంచి కురుస్తున్న భారీ వర్షా లకు రైతులు నిండా మునిగారు. మండలంలోని మాన్కగూడ గ్రామానికి చెందిన రాంసాయి ఈఏ డాది రెండు ఎకరాల్లో సోయా పంట సాగు చేశాడు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు సోయాకు కాత, పూత లేదు. ఎకరానికి రెండు క్వింటాళ్ల దిగుబడి రావడమే కష్టంగా మారిందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.

**సిరికొండ :** రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది వర్షం. ఈ ఏడాది విస్తరంగా కురుస్తున్న వర్షాలకు చేతికి వస్తున్న పంటలు దెబ్బతింటు న్నాయి. సోమవారం మండలంలో భారీ వర్షం కుర వడంతో చిక్మన్ వాగు పొంగిపోర్లింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.

## డీఎస్పీ మృతికి సంతాపం

**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**



జిల్లా కేంద్రంలోని ఫంక్షనల్ వర్టికల్స్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న విష్ణుమూర్తి హైదరాబాద్‌లో గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. విధినిర్వహణలో నిబద్ధతతో పని చేశారని, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. ఆయన మృతి పోలీసు శాఖకు తీరనిలోటన్నారు.

## గేదెను ఢీకొని యువకుడు మృతి

**లోకేశ్వరం, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**



మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై గేదెను ఢీకొని యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... లోకేశ్వరం మండలం హవర్గాకు చెందిన సిందే అరవింద్ పటేల్ (30) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో 61వ జాతీయ రహదారిపై అడ్డుగా ఉన్న గేదెను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అరవింద్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

యువతి తన ప్రేమను నిరాకరించిందని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని తిలక నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చిట్యాల శ్రీకాంత్ (20) కొంత కాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. విషయాన్ని యువతికి తెలియజేయడంతో నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. అఘాయిత్యానికి పాల్పడే ముందు తన అన్నకు వీడియోకాల్ చేసి ఉరేసుకుంటున్నట్లు తెలిపాడు. అతను స్థానికులకు సమాచారం అందించడంతో కొన ఊపిరితో ఉన్న శ్రీకాంత్ను రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి గజానన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

## ఇచ్చోడలో రెండిళ్లలో చోరీ

**ఇచ్చోడ, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో రాత్రి తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగింది. మండల కేంద్రానికి చెందిన గెడం చంద్రకాంత్ తమ స్వగ్రామం బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్లకు, దమ్మపాల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదిలాబాద్‌కు వెళ్లారు. గమనించిన దొంగలు తాళాలు పగల కొట్టి ఇళ్లలో చొరబడ్డారు. చంద్రకాంత్ ఇంట్లో 15 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదు, దమ్మపాల్ ఇంట్లో 2 బంగారం, రూ.85 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.





## మహిళ ఆత్మహత్యాయత్నం


### అడ్డుకోబోయిన భర్తకు సైతం గాయాలు

**నెన్నెల, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**

దంపతుల మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన భార్య ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుండ్లసోమారం గ్రామానికి చెందిన జాడి రాజన్న, లలిత దంపతులకు కూతురు అంజలి, కుమారుడు తేజ ఉన్నారు. సోమవారం ఉదయం అంజలి సారీ ఫంక్షన్ విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన లలిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. మంటలను అర్పేక్రమంలో రాజన్నకు గాయాలయ్యాయి. పరిస్థితి విష మంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

## వృద్ధుడి మృతదేహం లభ్యం

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అబ్రహంనగర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు ఈ నెల2న అదృశ్యం కాగా మండలంలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో మృతిచెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. అబ్రహంనగర్‌కు చెందిన వేల్పుల ఎల్లయ్య(70) ఈ నెల 2వ తేదీన మేకలను కాసేందుకు ఇంటి నుండి వెళ్ళి రాకపోవ డంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు తెలిసిన ప్రదేశాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ మేరకు వృద్ధుని కుమారు డు వేల్పుల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా సోమవారం సిఐ శశిధర్ రెడ్డి,పట్టణ ఎస్సై రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృత దేహం తప్పిపోయిన వేల్పుల ఎల్లయ్యదిగా గుర్తించారు.



# అడవీ..! నీ బిడ్డ అమరుడు..!

- ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక కుమ్రం భీం
- ఆస్తిత్వ ఉద్యమాల వేగుచుక్క భీం
- నేడు కుమ్రంభీం 85వ వర్ధంతి
- నిజాం గుండెల్లో నిద్రపోయిన కుమ్రంభీం
- 1940కి ముందే తుపాకీ పట్టిన గోండు వీరుడు
- జల్-జంగల్-జమీన్ కోసం గెరిల్లా పోరాటం
- భీం స్ఫూర్తితోనే రజాకార్లతో పోరాడిన ఆనాటి యువకులు, ఆదివాసీలు
- భీం వర్ధంతికి ముస్తాబయిన జోడేఘాట్..



సయ్యద్ కరీం, ఎడిటర్ ప్రభాత సమాచారం

దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, అక్కడక్కడ పారే సేల యెళ్లు.. ఆ సేల యెళ్ల మద్య సమాజానికి దూరంగా ఉన్న అడవి తల్లి ముద్దుబిడ్డలు, బుక్కెడు బువ్వకోసం పడరాన్ని పాట్లు పడుతున్న రోజులవి..దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించలేదు. దేశాన్ని తెల్లదోరలు, రాష్ట్రంలో నిజాం నవాబులు పాలిస్తున్న రోజులు.. 1935వ సంవత్సరం ఆ కాలంలో ఆసిఫాబాదే జిల్లా కేంద్రంగా ఉండేది. జిల్లాలో అడవి తల్లి బిడ్డల బతుకంత విషాదామే. నీతి నిజాయితీని, అడవి తల్లి ని నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసులపై నిజాం సర్కార్? పాలనలో దోపిడీ ,దౌర్జన్యాలు మితిమీరిపోయాయి .రెండు కాళ్ల ఆధునిక మృగాల తాకిడికి అడవి, అడవంతా అల్లాడింది. దళారులు, వ్యాపారులు, అటవీ అధికారులు, నిజాం పోలీసుల చేతుల్లో అడవి బిడ్డల బతుకులు దోపిడి పిడనకు అలవాలమైయ్యాయి. చివరికి అడవి బిడ్డల ఊపిరికి కూడ దోపిడికి గురైంది. అడవి తల్లి బిడ్డల అక్రందనను రణనినాదంగా మార్చి కొండకోనల్లోని అడవి బిడ్డలను మేలుకోల్పిన మహాశక్తి కొదమ సింహం కుమ్రం భీం. ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతికగా స్వయం పాలన, ఆస్తిత్వ ఉద్యమాల వేగుచుక్క కుమ్రం భీం పోరాటమే చివరకు సరైన మార్గమని తన జాతి ప్రజలను విముక్తి చేస్తుందని అక్షరాల నమ్మిన ఆదివాసీ పోరాట యోదుడు కుమ్రం భీం. జోడేఘట్ అడవుల్లో నిజాం పాలకులతో పోరాడి వీరమరణం పోందిన కుమ్రం భీం సంఘటన జరిగి శనివారం నాటికి 85ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ ప్రత్యేక సందర్భంలో ఆదివాసీ సమాజం కుమ్రం భీం వర్ధంతిని జరుపుకుంటున్నాయి. ఆదివారం కెరమెరి మండలంలోని జోడేఘట్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా వర్ధంతి కార్యక్రమం చేపడుతున్నారు. స్వయం పాలన కోసం ఆదివాసీలు అలుపెరగకుండా ఉద్యమిస్తున్న పరిస్థితులు ప్రస్తుతం రాష్ట్రమంత నెలకొన్నాయి. స్వయం పాలన కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీల పోరాటాలను అణచివేసేందుకు కుట్రలు జరుగతూనే ఉన్నాయి. దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసులు ఉద్యమించిన సందర్భాలు అనేకంగా ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేఖంగా బిర్సాముండా, సంతాల్‌లు తిరుగుబాటు చేశారు. జల్-జంగల్-జమీన్ కోసం సాయుద పోరాటాలు జరిగాయి. తమపై సాగుతున్న అన్ని రకాల దోపిడి, పిడనలను ఎదురించారు. చరిత్రలో అనేక సార్లు ఓటమి చెందినా తమ జీవితమే యుద్ధమైన చోట తమ ఆస్తిత్వం కోసం ఆదివాసులు అలుపేరగని పోరాటాలు చేస్తునే ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని గొండులు ఎప్పటికీ ఒక రాజ్య భావనలో ఇమిడి లేదు. వారు స్వేచ్ఛ ప్రీయులు. వారి జీవనాధరమైన అడవి నుంచి వారిని తరిమేసే విధానాలు, చట్టాలతో వారు తలపడుతునే ఉన్నారు. పోడు వ్యవసాయం ఆదివాసీల జీవనాధారం. అడవిని నరికి పంట వేస్తే అది అటవీ భూమని ఒకరు, కాదు రెవెన్యూ భూమని మరొకరు వచ్చి ఆదివాసీలను వారి భూముల నుండి తరిమేశారు. పంటలను ధ్వంసం చేశారు. జరిమానాలతో వేధించారు. ఈ వేధింపులు అణచివేతల నుంచే ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు పోరు బాట పట్టారు. మా ఊర్లో మా రాజ్యం అంటు 12 గొండు గూడేలు బాబేర్ఝూరి కొండల్లో తుడుం మోగించాయి. కుమ్రం భీం నాయకత్వంలో ఆదివాసీలు సంఘటితం అయి తమపై జూలుం చేస్తున్న దోపిడి వర్గాలపై తుడుం మోగించారు. కుమ్రం భీం పోరాటం పలు ప్రాంతాలకు విస్తరించేలోపే నిజాం సేనలతో భీకర పోరు జరిగింది. కుమ్రం భీంతో సహా 12 మంది ఆదివాసీ వీరులు అమరులైయ్యారు. నిజాం సర్కార్ పాశవికంగా కుమ్రం భీం పోరాటాన్ని అణచివేసింది. భీం అమరత్వం ఇప్పటికి జోడేఘట్ కోండల్లో ప్రతిధ్వనిస్తుంది. ఏ హక్కుల కోసమైతే... నాడు కుమ్రం భీం ఉద్యమించాడో.. ఆ హక్కుల కోసం ఆదివాసులు నేటికి నిరంతర పోరాటాం చేయవలసి వస్తోంది. ప్రజాస్వామిక రాజ్యంలో కూడా ఆదివాసీలు అవస్థలు తీరలేదు. నిజాం రాజు నియమించిన హైమన్‌డార్ఫ్ సూచనలను కూడా నేటి పాలకులు పాటించడం లేదు. కానీ నాటి నిజాం ప్రభువు గిరిజనుల అభివృద్ధి కోసం డార్ఫ్ సూచనలు పాటించాడు. వారి అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాడు. కానీ నేటి ప్రభుత్వాలు అవేవి పట్టకుండ ఆదివాసులపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారు. హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఆదివాసులపై నిర్భందాన్ని ప్రయోగిస్తున్నారు. ఆదివాసీల ఐక్యతను చూసి తట్టుకోలేని ప్రభుత్వం ఇంద్రవెల్లి మరణకాండను సృష్టించింది. ఇంద్రవెల్లి సంఘటనతో దేశ వ్యాప్తంగా ఆదివాసుల పోరాటానికి సంఘీభావం వచ్చింది. ప్రభుత్వ ధమననీతిని ఖండించారు. రాజ్యం తన హైమమైన చర్యలు చేస్తునే మరోవైపు సంస్కరణలు చేపట్టింది. ఆదివాసులు మౌలిక సమస్యలు పరిష్కరించకుండ పైపూత మాటాలతో జోకొట్టే ప్రయత్నం చేసింది. ఆదివాసి ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ ఇచ్చే రాజ్యంగంలో 5వ షెడ్యుల్‌ను తుంగలో తొక్కి అదివాసులపై ముప్పెట దాడులు జరుగుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో భూ రక్షణ చట్టాలను అమలు పర్చడం లేదు. అన్యాక్రాంతం అవుతున్న అడవులను, భూములను పట్టించుకోవడం లేదు. సంక్షేమంలో ప్రభుత్వం నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతునే ఉంది. రక్షిత నీరు ఇంత వరకు అందలేదు. పౌష్టికాహార లోపంతో మరణిస్తున్న వారి లెక్కనే లేదు. కుమ్రం భీం పోరాటం చేసిన ప్రాంతమైన జోడేఘట్ ఇప్పటికి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతికగా నిలిచింది. గ్రామాల్లో కనీస సదుపాయలు లేకపోవడంతో ఆదివాసీల జీవన ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయి. కుమ్రం భీం వీరమరణం పోంది 85 ఏళ్లు అవుతున్న ఇంకా పోరాట స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది. ఆస్తిత్వ ఉద్యమాలు కోనసాగుతున్న నేటి తరుణంలో 1940లోనే ఆత్మగౌరవం, స్వపరిపాలన పునాదులుగా కుమ్రం భీం సాయుధ తీరుగుబాటు చేశాడు. ఆయన ముందు చూపు వివిధ ఉద్యమాలకు ప్రేరణగా నిలుస్తుంది. స్వయం పాలన కోసం బాబేర్ఝూరి కొండల్లో మోగిన తుడం కుమ్రం భీం వారసత్వంగా నేటికి కొనసాగుతునే ఉంది.



# ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి





### ఉమ్మడి ఆదిలాబాద్ కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేయాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సోమవారం స్థానిక సంస్థల అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. జిల్లాల్లో ముఖ్య నాయకులతో సంప్రదించి ఏకాభిప్రాయంతో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునే విధంగా పని చేయాలని మంత్రి జూపల్లి దిశానిర్దేశం చేశారు. ఎన్నిక ప్రచారం కోసం క్షేత్రస్థాయిలో నేతలు చేపట్టాల్సిన కార్యక్రమాలను, ప్రజలకు వివరిం చాల్సిన పథకాలు, అభివృద్ధి పనుల గురించి మంత్రి వివరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఆరు గ్యారంటీల అమలుపై ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సమా శంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి విట్టల్ రెడ్డి, వేణుగోపాలచారి, శ్రీనివాస్, సోయం బాపూరావు ఆత్మీరాశ్యాం నాయక్ ఆయా నియోజక వర్గ, పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### కుమ్రం భీం వర్ధంతిని

## రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం

### ఫలించిన ఎమ్మెల్యే కృషి



**ఉట్నూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
జల్.. జంగల్.. జమీన్ పై హక్కుల కోసం నిజాం సర్కార్‌కు ఎదురొడ్డి సాయుధ పోరాటం చేసి వీరమరణం పొందిన గోండు వీరుడు కుమ్రం భీం వర్ధంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఆదివాసులకు ఆరాధ్య దైవమైన కుమ్రం భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిని ముఖ్య మంత్రి అంగీకరించి ఈ నెల 7 మంగళవారం అశ్వయుజ మాసం పౌర్ణమి రోజున కుమ్రం భీం వీరమరణం పొందిన పుణ్య భూమి జోడే ఘాట్ లో జరిగే వర్ధంతిని రాష్ట్ర పండుగ గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపెల్లి కృష్ణారావు లకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆసిఫాబాద్ పట్టణ బంద్ ప్రశాంతం





**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలో గత శుక్రవారం శారద, దుర్గదేవిల శోభాయాత్రలో పోలీసులతీరును నిరసిస్తూ హిందూ సంఘాల సభ్యులు సోమవారం ఇచ్చిన పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూసివేసి స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బంద్‌తో దుకాణాలన్నీ మూసి ఉండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. శోభాయాత్రలో మహిళ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు చేదోడువాదోడుగా ఉండాల్సిన పోలీసులే ఇబ్బందులకు కారణమవుతున్నారని విమర్శించారు. పట్టణంలో ఇటీవల జరిగిన వినాయక, దుర్గా నవరా త్రులను సంప్రదాయ బద్ధంగా జరుపుకోని వ్వకపోవడం బాధాకరమన్నారు. మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఎస్సై ఉదయ్ కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భక్తులపై అక్రమ కేసులు బనాయించడం శోఛనీయ మన్నారు. గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థి తులు నెల కొనలేదని అందరు ఐకమత్యంతో పండుగలు సంప్రదా యబద్ధంగా జరుపుకుంటువస్తున్నారన్నారు. పోలీ సులు అత్యుత్సాహం ప్రదర్శించడం సరికాదన్నారు. ఇ లాంటి సంఘటనలు పునరా వృతంకాకుండా సంబం ధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భక్తులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేసి, నిర్వాహకులకు సంబంధించిన డీజేలను ఇవ్వాలని కోరారు. సభ్యులు బాలేశ్వర్‌గౌడ్, గాదవేణి మల్లేష్, చిలువేరి వెంకన్న, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# గోండి భాషపై డిక్షనరీ వర్క్ షాప్

**ఉట్నూర్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
గోండి భాష ప్రామాణీకరణ డిక్షనరీ వర్క్ షాప్ కోసం ఐదు రోజుల వర్క్ షాప్‌లో అదిలాబాద్ జిల్లా వాసులు పాల్గొన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గాడ్ మండ్లలో ఆదివాసీల వీరనారి రాణి దుర్గావతి జయంతి సందర్భంగా నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సంపతియ ఊయికే ముఖ్య అతిథిగా పాల్గొని వర్క్ షాప్ ను పరిశీలించారు. గోండి భాష వర్క్ షాప్‌లో ఆదిలాబాద్ జిల్లా వాసులైన తొడసం దేవురావు, పుర్క ఓం ప్రకాష్, జంగు, రాకేశ్, సీతారాం, కుమ్రలాల్ షావులకు పాల్గొన్నట్లు తెలిపారు. గోండిభాష సంస్కృతి, సంప్రదాయాలను భావిత రాలకు అందించడానికి కృషి చేయాలని మంత్రి సూచించారని పేర్కొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# జిల్లాను విపత్తు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించాలి

■ మాజీ మంత్రి జోగు రామన్న ■ కలెక్టర్ రాజర్షి షాకు వినతి పత్రం అందజేత



**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సమాచారం)**
ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేలా ఆదిలాబాద్ జిల్లాను విపత్తు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షా కు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ... అధిక వర్షాలతో రైతుల పూర్తిగా నష్టపోయారని, తక్షణం వారిని ఆదుకునే దిశగా విపత్తు ప్రభావిత ప్రాంతంగా గుర్తించలన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాల నుండి నష్టపరిహారం అందించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.. పత్తి, జొన్న, సోయా, కంది పంట పూర్తిగా నష్టపోయాయన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేలు అందించేలా కృషి చేయాలి అన్నారు. రైతులను నష్టాల నుండి కోలుకునేలా వ్యవసాయ పరికరాలపై ప్రత్యేక రాయితీ అందిస్తూ రైతులకు లోన్లను రెన్యువల్ చేసేలా కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసం నర్సింగ్ రావు, మార్శెట్టి గోవర్ధన్, అడపా తిరుపతి, లింగారెడ్డి, ఉషన్న, వేణు గోపాల్ యాదవ్, బట్టు సతీష్, కోరెడ్డి ఆనంద్, సతీష్, భోజన, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.